


తెలుగు దినపత్రిక

# సాక్షర

చదువు..సమీక్షించు




ఆదిలాబాద్ సంపుటి : 14 సంచిక : 309 బుధవారం, నవంబర్ 04, 2026 ఎడిటర్: ఎ. లింగన్న పేజీలు : 8 రూ. 2.00

## భారత్ తో కయ్యం..పాకిస్తాన్ లో కోలుకోలేని దెబ్బ



సాక్షర, ముంబై: భారత్‌తో వాణిజ్య సంబంధాలు నిలిచిపోవడంతో 2019 నుంచి ఇప్పటివరకు పాకిస్తాన్‌కు సుమారు 40 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.5 లక్షల కోట్ల) ఆర్థిక నష్టం వాటిల్లిందని పాక్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ ఛైర్మన్ నూర్ మహమ్మద్ ఖసూరి వెల్లడించారు. పుల్వామా ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో వాణిజ్య బంధాలు దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల కోసం ఇప్పుడు పాక్ దూర ప్రాంతాల్లోని దేశాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో సరుకు రవాణా ఛార్జీలు పెరగడంతో పాటు వస్తువులు చేరేందుకు ఎక్కువ సమయం పడుతోందని వివరించారు.భారత్ నుంచి ముడిసరుకులు దిగుమతి చేసుకునే పాకిస్తాన్ ఔషధ రంగంపై ఈ పరిణామం ప్రభావం చూపిందని ఖసూరి పేర్కొన్నారు. భారత్‌తో తిరిగి వాణిజ్యం ప్రారంభిస్తే ఏటా 2 నుంచి 3 బిలియన్ డాలర్లు ఆదా చేయవచ్చని అంచనా వేశారు. దేశీయంగా పత్తి ఉత్పత్తి తగ్గడంతో వస్త్ర పరిశ్రమకు అదనంగా 5 బిలియన్ డాలర్ల భారం పడిందన్నారు. దీంతో బ్రెజిల్, ఈజిప్ట్, చైనా, అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. పత్తి పండించే ప్రాంతాల్లో రైతులు చెరకు సాగు వైపు మళ్లుతుండటంతో భవిష్యత్తులో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.చక్కెర, ఎరువులు, సిమెంట్, పెట్రోలియం ఉత్పత్తులు, ఇనుము, ఉక్కు, కూరగాయలు, భారీ యంత్రాల కోసం కూడా పాకిస్తాన్ దూర దేశాలపై ఆధారపడుతోందని ఖసూరి చెప్పారు. భారత్‌తో వాణిజ్యం పునరుద్ధరిస్తే రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సరఫరా వ్యవస్థ మెరుగుపడుతుందని, పెట్రోలియం దిగుమతుల భారం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. గతంలో భారత పర్యాటకులు పాకిస్తాన్‌లోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలతో పాటు వారి పూర్వీకుల గ్రామాలను సందర్శించేవారని, వాణిజ్య సంబంధాలు తెగిపోవడంతో ఆ పర్యాటక ఆదాయాన్నీ కోల్పోయామని తెలిపారు. ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక, కుటుంబ సంబంధాలు మెరుగైన ప్రాంతీయ సహకారానికి పునాదిగా నిలవగలవని పేర్కొన్నారు.

## కేసీఆర్‌పై పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం




సాక్షర, ఖమ్మం: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను ఏలి పేదోళ్ల కష్టాలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. వారి స్వార్థానికి, స్వలాభానికి రాష్ట్ర సొత్తును ఆ దొరలు కొల్లగొట్టి, ప్రజలను పేదవాళ్లుగా చేశారని ఆగ్రహించారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ తెల్దారుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు.పొర్లు దండాలు పెట్టుకుంటూ ప్రతిపక్షాల నేతలు తమ ప్రభుత్వం గురించి విమర్శలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో రైతులు వరి సాగు వేస్తే ఉరే అన్నారని.. తమ ప్రభుత్వం అన్నదాతలు పండించిన పంటకు బోనస్ ఇచ్చి ఆదుకుందని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి పేదింటికి సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తోందని వెల్లడించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. మళ్లీ మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తామని భరోసా కల్పించారు. 2 లో

## మురసు ఎఫెక్ట్..తెలంగాణకు వర్ష గండం..




సాక్షర, హైదరాబాద్: మురసు తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరిస్తూ వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గంటకు 40 కి.మీ వేగంతో వీచే ఈదురుగాలులతో వరి కోతల వేళ రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది.బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుఫాన్ ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాబోయే 24 నుంచి 48 గంటల్లో రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు సంబంధిత జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం.. ప్రధానంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై ఈ తుఫాన్ ప్రభావం కనిపించనుంది. ముఖ్యంగా ఆదిలాబాద్, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలతో పాటు నిజామాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. 2 లో

## నిరుపేద రైతుల భూములు వదిలేయండి

- రాపోల్–కాడ్లపూర్ పట్టాభూముల భూసేకరణ వెంటనే నిలిపివేయాలి
- కెసిఆర్ చేసిన తప్పు మీరు చేయకండి -టి టిడిపి మాజీ అధ్యక్షుడు ,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

సాక్షర,వికారాబాద్: పరిగి మండల పరిధిలోని రాపోల్–కాడ్లపూర్ గ్రామాల రైతుల పట్టాభూముల భూసేకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని షాద్‌నగర్ టీడీపీ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం TGIIC ద్వారా ప్రభుత్వం సేకరించేందుకు ప్రయత్నిస్తున్న భూములన్నీ 100 శాతం వ్యవసాయానికి అనుకూలమైన సారవంతమైన పట్టాభూములని ఆయన పేర్కొన్నారు. 3 లో

## మల్లారెడ్డి ఫాం హౌస్ తొలగింపు

సాక్షర,హైదరాబాద్: మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన ఫామ్‌హౌస్‌పై హైడ్రా చర్యలు చేపట్టింది. ఫాక్స్ సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన ఫామ్‌హౌస్ ప్రహరీ గోడతో పాటు ప్రధాన గేటును అధికారులు బుల్డోజర్ల సహాయంతో కూల్చివేశారు. ఫాక్స్ సాగర్ చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా అధికారులు భారీ స్థాయి ఆపరేషన్ ప్రారంభించారు. దూలపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 124 పరిధిలో మల్లారెడ్డి కుటుంబ సభ్యుల ఫామ్‌హౌస్ ఉంది. అక్కడ దాదాపు 15 ఎకరాల భూమి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని అధికారులు గుర్తించారు. చెరువు పరిధిలో మట్టి పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గోడ, గేటును తొలగించారు. జీడిమెట్లలోని సర్వే నెంబర్లు 41, 42 పరిధిలో ఉన్న మరో 20 ఎకరాల విస్తీర్ణంలోని ప్రహరీ గోడలను కూడా అధికారులు నేలమట్టం చేశారు. 3 లో

## మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు

సాక్షర, హైదరాబాద్: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో పాటు వారి వ్యాపారాల విస్తరణకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, విధానపరమైన సహకారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ( WEEC )ను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. సచివాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామిక రంగంలో మరింతగా ఎదిగేందుకు అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మహిళలు కేవలం చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా భారీ పరిశ్రమలు, స్టార్టప్‌లు, వివిధ వ్యాపార రంగాల్లోనూ తమదైన ముద్ర వేయాలన్నది ఈ కౌన్సిల్ ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 2 లో

## నవంబర్ 3న అమెరికాలో మధ్యంతర ఎన్నికలు



వాషింగ్టన్: అ మెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మా రిపబ్లికన్ పార్టీని గెలిపిస్తే.. 18 ఏళ్లు నిండిన అమెరికన్లందరికీ 5 వేల డాలర్ల చొప్పున ఇస్తానంటూ ఆకర్షణీయమైన హామీ కూడా ఇచ్చారు. అయితే మధ్యంతర ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం అంత తేలిక కాదని చరిత్ర చెబుతోంది. అమెరికాలో అసలు మధ్యంతర ఎన్నికలు ఎందుకు నిర్వహిస్తారు...? ఈ ఎన్నికల్లో ఓడిపోతే అధ్యక్షుడిపై ఎలాంటి ప్రభావం ఉంటుంది?


పూర్తిగా 3 లో

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ఈ-లాటరీ ని ప్రారంభించిన మంత్రి పొన్నం



సాక్షర, హైదరాబాద్: నాంపల్లి గృహకల్ప కార్యాలయంలో 4 నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ఈ-లాటరీ ని మంత్రి పొన్నంప్రభాకర్ ప్రారంభించారు. హైదరాబాద్ క్యూర్ ఏరియా కి సంబంధించి గోషామహల్ చాంద్రాయణ గుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్లకు ఈ లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, హౌసింగ్ ఎండీ గౌతమ్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ఈ-లక్కీ డ్రా విధానం ద్వారా ఎంపికైన లబ్ధిదారులు 1.కోమల్ అనే మహిళ 2. బచల చైతన్య,3, మధుగుల మమత,4.గ్యాదరి నందిని,5. చిన్నపగ వీరమణి,6.అమరకీర్తి పేర్లను మంత్రి పొన్నం ప్రభాకర్ చదివి వినిపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ లక్కీ డ్రా ద్వారా ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారికి శుభాకాంక్షలు ప్రజా ప్రభుత్వం లో నియోజకవర్గానికి 5500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరిగింది మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇళ్లు,రెండవ దశలో 2 వేల ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. చాలా వరకు మొదటి దశ ఇల్లు పూర్తయ్యాయి ఫేజ్ మ్యానర్ లో వారికి డబ్బులు ఇవ్వడం జరుగుతుంది. గతంలో ఉపాధి ఒక దగ్గర ఉంటే ఇల్లు ఒక దగ్గర ఉండేది అక్కడ నిర్మించిన ఇళ్లలో ఉండే పరిస్థితి లేకుండే అలాంటి పరిస్థితి రావద్దని ఉపాధి ఎక్కడ ఉంటే ఇల్లు అక్కడే ఉండాలని నిర్ణయించాం, గుడిసెలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో, పార్టీ, కుల, మత సంబంధం లేకుండా అందరికీ ఈ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. మధ్యలో కట్టుకొని ఆపుకున్న వారికి, కొత్తగా ఇళ్లు లేని పేదలకు ఇవి వర్తిస్తాయి.

## కేంద్ర ఉద్యోగులకు పెరగనున్న డీఏ




సాక్షర, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కరువు భత్యం , కరువు ఉపశమనంలను 3 శాతం పాయింట్లు పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉద్యోగుల డీఏ, పింఛనుదారుల డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరగనున్నాయి. దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పింఛనుదారులు ప్రయోజనం పొందనున్నారు.డీఏ పెంపు ఉద్యోగుల ప్రాథమిక వేతనంపై ఆధారపడి ఉంటుంది. అంటే ప్రాథమిక వేతనంలో 3 శాతం పాయింట్ల మేరకు అదనపు భత్యం లభిస్తుంది. ఉదాహరణకు, రూ.18,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం 60 శాతం డీఏ ప్రకారం రూ.10,800 లభిస్తోంది. కొత్త రేటు 63 శాతానికి చేరితే ఈ మొత్తం రూ.11,340 అవుతుంది. అంటే నెలకు అదనంగా రూ.540 అందుతుంది. అలాగే, రూ.35,400 ప్రాథమిక వేతనం ఉన్న ఉద్యోగికి నెలకు రూ.1,062 అదనంగా లభిస్తుంది. రూ.50,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి నెలవారీ డీఏ రూ.30,000 నుంచి రూ.31,500కు పెరుగుతుంది. దీంతో నెలకు రూ.1,500 అదనపు ప్రయోజనం కలుగుతుంది.మోదీ సర్కార్ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకూ ప్రయోజనం కలుగుతుంది. వారి అర్హతగల ప్రాథమిక పింఛనుపై డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరుగుతుంది. దీంతో నెలవారీ పింఛను ఆదాయంలో పెరుగుదల ఉంటుంది.డీఏ, డీఆర్ పెంపుతో కేంద్ర ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ.10,016 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనున్నట్లు సమాచారం. పూర్తిగా 2 లో

## పైరేట్స్ మట్టి కరిపించిన ఇండియన్ నేవీ



సాక్షర,ముంబై: భారత నావికాదళం సముద్ర భద్రతలో కీలక పాత్ర పోషిస్తుంది. సోమాలియా ఈశాన్య తీరం దగ్గర సాయుధ సముద్రపు దొంగలు హైజాక్ చేసిన ఇరానియన్ ఫిషింగ్ నౌక అజినిని భారత నావికాదళం విజయవంతంగా రక్షించింది. 48 గంటలకు పైగా సాగిన ఆపరేషన్‌లో 20 మంది సిబ్బందిని ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు లేకుండా సురక్షితంగా విడిపించారు. అక్టోబర్ 29న సోమాలియా ఈశాన్య తీరంలో బందర్ బైలా–హఫున్ ప్రాంతం మధ్య సాయుధ దొంగల ముఠా సుమారు 12 మంది అజిని నౌకను స్వాధీనం చేసుకుంది. ఈ నౌకను వాణిజ్య నౌకలపై మరిన్ని దాడులకు మదర్ షిప్ గా ఉపయోగించే అవకాశం ఉందని మారిటైమ్ భద్రతా సంస్థలు హెచ్చరించాయి.

పూర్తిగా 3 లో

# ఇంటి నుంచే లెర్నర్ లైసెన్స్ టెస్ట్..




- RTO కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేదు..!

సాక్షర, హైదరాబాద్: లెర్నర్ లైసెన్స్ పరీక్షను ఇంటి నుంచే రాసే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు తెలంగాణ రవాణాశాఖ సిద్ధమవుతోంది. అందుకు సారథి న్యూ లెర్నర్ లైసెన్స్ పరీక్ష వ్యవస్థతో పాటు ఏఐ, ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతను ఉపయోగించనున్నారు. అభ్యర్థి గుర్తింపు, పరీక్ష సమయంలో కదలికలు, మాల్‌ప్రాక్టీస్‌ను సాంకేతికంగా పర్యవేక్షిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి వెంటనే క్యూఆర్ కోడ్ ఆధారిత ఎల్‌ఎల్‌ఆర్ జారీ చేయనున్నారు. ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతమైతే వారం రోజుల్లోనే కొత్త విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.వాహనాలు నడపడం నేర్చుకునే ముందు తప్పనిసరిగా రాయాల్సిన లెర్నర్ లైసెన్స్ పరీక్ష ను ఇకపై ఇంటి నుంచే రాసే అవకాశాన్ని కల్పించేందుకు తెలంగాణ రవాణా శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం సారథి న్యూ లెర్నర్ లైసెన్స్ పరీక్ష విధానంతో పాటు ఏఐ ఆధారిత సాంకేతికతను పరిశీలిస్తోంది. ఈ కొత్త విధానంలో అభ్యర్థి ముఖాన్ని గుర్తించే ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికత ద్వారా వ్యక్తిగత ధ్రువీకరణ చేపట్టనున్నారు. పరీక్ష సమయంలో అక్రమాలకు పాల్పడితే తక్షణమే గుర్తించేలా ప్రత్యేక వ్యవస్థలను రూపొందించారు. ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతమైతే వారం రోజుల్లోనే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని రవాణాశాఖ భావిస్తోంది.ప్రస్తుతం లెర్నర్ లైసెన్స్ పరీక్ష రాయాలంటే అభ్యర్థులు సంబంధిత రవాణా కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త విధానం అమల్లోకి వస్తే ఈ ఇబ్బందులు తగ్గనున్నాయి. ఇంటి నుంచే కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుంది. అయితే పరీక్ష పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సురక్షితమైన బ్రౌజర్, రియల్‌టైమ్ అభ్యర్థి ధ్రువీకరణను తప్పనిసరి చేయనున్నారు. పరీక్ష సమయంలో అభ్యర్థి కెమెరా ముందు కనిపించకపోయినా, మధ్యలో వేరే వ్యక్తి వచ్చినా, సాంకేతిక అవాంతరాలు ఎదురైనా వ్యవస్థ వెంటనే హెచ్చరికలు జారీ చేస్తుంది. ఇతర వెబ్‌సైట్లను తెరిచేందుకు ప్రయత్నించినా నిఘా వ్యవస్థ గుర్తిస్తుంది.పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలతో లాగిన్ కావాలి. అనంతరం ఫేషియల్ వెరిఫికేషన్ ద్వారా అభ్యర్థి గుర్తింపును నిర్ధారిస్తారు. పరీక్ష జరుగుతున్నంతసేపు ఏఐ ఆధారిత వ్యవస్థ అభ్యర్థి కదలికలను పర్యవేక్షిస్తుంది. ఫేషియల్ వెరిఫికేషన్ పలుమార్లు విఫలమైతే ఓటీపీ పంపిస్తారు. ఆ ఓటీపీని నమోదు చేసిన తర్వాత అభ్యర్థికి సమీపంలోని ఆర్టీవో కార్యాలయానికి వెళ్లి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు.పరీక్షలో ప్రశ్నల స్థితిని సులభంగా గుర్తించేందుకు రంగుల విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు. ఒక ప్రశ్నకు సమాధానం నమోదు చేస్తే గ్రీన్ రంగులో కనిపిస్తుంది. ప్రశ్నను చూసి సమాధానం ఇవ్వకపోతే రెడ్ రంగు, ఇంకా చూడని ప్రశ్నలకు వైట్ రంగు కనిపిస్తుంది. దీంతో అభ్యర్థులు ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు, ఎన్ని ప్రశ్నలు మిగిలిపోయాయో సులభంగా తెలుసుకోవచ్చు.పరీక్ష పూర్తయిన వెంటనే అభ్యర్థి ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించారో ఫలితం వెల్లడవుతుంది. పరీక్షలో అర్హత సాధించిన వారికి తక్షణమే క్యూఆర్ కోడ్‌తో కూడిన లెర్నర్ లైసెన్స్ (LLR) జారీ అవుతుంది. ఈ విధానం అందుబాటులోకి వస్తే రవాణా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గడంతో పాటు సమయం ఆదా కానుంది. అదే సమయంలో సాంకేతిక నిఘా ద్వారా పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని రవాణాశాఖ భావిస్తోంది.

# డెమోక్రాట్లు గెలిస్తే 'మిస్టర్ వీటో'గా మారిపోతా.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- డెమోక్రాట్లు గెలిస్తే అన్ని నిర్ణయాలను వీటో చేస్తానన్న ట్రంప్
- మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయాలని ఉందని వ్యాఖ్య
- రాజ్యాంగం ప్రకారం మూడోసారి ఎన్నిక కావడం సాధ్యం కాదని అంగీకారం
- తన సిబ్బందిపై విచారణలు జరిగితే ముందస్తు క్షమాభిక్షలు ఇస్తానని వెల్లడి
- డెమోక్రాట్లకు అనుకూలంగా ఉన్నాయంటూ సర్వేలను తప్పుబట్టిన ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే వారి ప్రతిపాదనలన్నింటినీ వీటో చేస్తానని హెచ్చరించారు. మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని, అయితే రాజ్యాంగ నిబంధనలు అందుకు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నారు. న్యూయార్క్ పోస్ట్ కాలమిస్ట్ మిరాండా డివైన్‌తో 'పాడ్ ఫోర్స్ వన్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ ఓటమి ఎదురైతే.. 'మిస్టర్ వీటో'గా మారతానని అన్నారు. నెల లేదా రెండు నెలల పాటు వరుసగా వీటోలు వేస్తే డెమోక్రాట్లు చర్చలకు వచ్చి ఒప్పందానికి అంగీకరిస్తారని వ్యాఖ్యానించారు. మూడోసారి పోటీపై ఆసక్తి: మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం వస్తే తప్పకుండా బరిలో ఉండాలని ఉందని ట్రంప్ చెప్పారు. అయితే రాజ్యాంగంలోని నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయని అంగీకరించారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా ఎన్నికవడానికి వీల్లేదు. ట్రంప్ 2016, 2024 ఎన్నికల్లో విజయం సాధించారు.
ముందస్తు క్షమాభిక్షలు ఇస్తా: కాంగ్రెస్‌పై డెమోక్రాట్లు పట్టు సాధించి తనకు పనిచేసినవారిపై విచారణలు ప్రారంభిస్తే.. వారికి ముందస్తు క్షమాభిక్షలు ఇచ్చేందుకు సిద్ధమని ట్రంప్ వెల్లడించారు. గతంలో జనవరి 6 ఘటనకు సంబంధించి క్షమాభిక్షలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.డెమోక్రాట్లు ఆధిక్యంలో ఉన్నట్లు వెల్లడిస్తున్న సర్వేలను ట్రంప్ కొట్టిపారేశారు. అవి పక్షపాతంతో ఉన్నాయని ఆరోపించారు. రిపబ్లికన్లను సరిగా సర్వే చేయడం లేదని విమర్శించారు. డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్‌తో పాటు భవిష్యత్తులో అధ్యక్ష పదవినీ గెలుచుకుంటే దేశం అంతమవుతుందని హెచ్చరించారు.

# దేవుళ్ల వ్యాఖ్యలపై ధీరేంద్ర శాస్త్రి క్షమాపణలు

- వీడియోను తప్పుగా అర్థం చేసుకున్నారంటూ వివరణ

సాక్షర, భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లా బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ధీరేంద్ర కృష్ణ శాస్త్రి అలియాస్ బాగేశ్వర్ బాబా ఇటీవల శ్రీరాముడు, శ్రీకృష్ణుడి స్వభావాలను పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆధ్యాత్మిక వివాదానికి దారితీశాయి. మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లా కరేరా ప్రాంతంలో నిర్వహించిన రామ్‌కథా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతుండగా చిత్రీకరించిన ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారంలోకి వచ్చింది. ఈ వీడియోలో ఆయన శ్రీరాముడిని ఎంతో సూటిగా, నిటారుగా ఉండే దేవుడిగా వర్ణిస్తూ.. శ్రీకృష్ణుడిని వంకర బుద్ధితో అంటే నటనాత్మక, కోపతాపాలతో కూడిన భావంతో అభివర్ణించారు. వేదికపై వేణువు వాయిస్తున్న వ్యక్తిని చూపిస్తూ.. వేణువు ఊదడం పెద్ద విషయమేమీ కాదని, ధనుస్సును ధరించడం మాత్రమే అసలైన బాధ్యత అని వ్యాఖ్యానించడం భక్తుల మనోభావాలను దెబ్బతినేలా చేసింది.అసలేం జరిగిందంటే..? ఈ వివాదాస్పద వ్యాఖ్యల క్లిప్పింగ్స్ వెలుగులోకి రావడంతో హిందూ ధార్మిక వర్గాలు, రాజకీయ నేతల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తూ.. సనాతన ధర్మంలో అత్యంత పూజనీయులైన దేవుళ్ల మధ్య ఇలాంటి చౌకబారు పోలికలు తీసుకురావడం అత్యంత విచారకరమని, అభ్యంతరంకరమని మండిపడ్డారు. ఇది హిందూ సమాజంలో విభజన తీసుకు రావడానికి చేస్తున్న ప్రయత్నమని ఆరోపిస్తూ, ప్రవచనకర్తపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తుల నిరసనలు, రాజకీయ నేతల విమర్శలు వెల్లువెత్తడంతో తీవ్ర ఒత్తిడికి గురైన ధీరేంద్ర శాస్త్రి ఒక ప్రత్యేక వీడియో సందేశం ద్వారా తన స్పష్టతనిస్తూ క్షమాపణలు తెలిపారు.భగవంతుడిపై ప్రేమపూర్వకమైన నిందలు వేసేవాళ్లు
తన వివరణలో ధీరేంద్ర శాస్త్రి మాట్లాడుతూ.. పూర్తి వీడియోను చూడకుండా కేవలం ఒక చిన్న భాగాన్ని మాత్రమే చూసి ప్రజలు తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తాను స్వయంగా శ్రీకృష్ణుడి పరమ భక్తుడినని, వ్రజభూమిలో జీవించడమే తన ఆకాంక్ష అని తెలిపారు. పూర్వకాలంలో గోపికలు లేదా పూర్వ కవులు భగవంతుడిపై ప్రేమపూర్వకమైన నిందలు వేస్తూ రాసిన ఒక భక్తి గీతాన్ని వివరిస్తున్న సమయంలోనే ఆ ఉదాహరణ చెప్పానని స్పష్టం చేశారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడి మధ్య వ్యత్యాసాలు చూపించడం తన ఉద్దేశం కాదని, వేణువు వాయించడం ఆటపాటల రూపమని, ధనుస్సును పట్టుకోవడం ధర్మ రక్షణకు సంకేతమని ఒక సంతు చెప్పిన భావాన్ని మాత్రమే తాను వివరించానని తెలిపారు.తాను ఎప్పుడూ శ్రీకృష్ణ జన్మభూమి కోసం ముందుండి పోరాడే వ్యక్తిగా ఉన్నానని, కృష్ణుడికి వ్యతిరేకం కాదని బాగేశ్వర్ బాబా పునరుద్ఘాటించారు. తన మాటల వల్ల లేదా భావాల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే.. వినయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నానని వ్యాఖ్యానించారు. ఈ వివరణతోనైనా వివాదానికి తెరపడుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

# తెలంగాణ పొలిటికల్ గేమ్‌లో జగన్ దారెటు

సాక్షర, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిల మధ్య ఉన్న సాన్నిహిత్యం, ఆ రెండు పార్టీల మధ్య ఉన్న సత్సంబంధాలు అందరికీ తెలిసినవే. గడిచిన కొన్నేళ్లుగా ఒకరికొకరు నైతిక



మద్దతు ఇచ్చుకుంటూ వచ్చారు. కానీ, మారిన తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో భాగంగా కేటీఆర్ తీసుకుంటున్న కొత్త రాజకీయ వ్యూహం ఇప్పుడు పొరుగు రాష్ట్రంలో ఉన్న తన ఆప్తమిత్రుడు జగన్‌మోహన్ రెడ్డిని ఇరకాటంలో పడేస్తోంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడానికి కేటీఆర్ పదే పదే ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు నాయుడు సర్కార్ పాలనను, అక్కడ జరుగుతున్న వాటర్ మేనేజ్‌మెంట్‌ని ప్రశంసించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో.. మా తెలంగాణలోనే సంక్షేమం, అభివృద్ధి వేగంగా సాగుతున్నాయి, పొరుగున ఉన్న ఏపీలో విద్యుత్ కోతలు, దారుణమైన రోడ్లు ఉన్నాయి అంటూ కేటీఆర్, ఇతర గులాబీ నేతలు పరోక్షంగా విమర్శించేవారు. అప్పుడు ఏపీలో సీఎంగా ఉన్నది తన మిత్రుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అయినప్పటికీ, తెలంగాణ మోడల్‌ను గొప్పగా చాటుకోవడానికే కేటీఆర్ ఏపీని తక్కువ చేసి మాట్లాడారు. ఇక ఇప్పుడు సీన్ తలకిందులైంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం పీఠం ఎక్కడంతో.. రేవంత్ రెడ్డి నమూనా ఎంత దారుణంగా ఉందో చూపించే క్రమంలో చూడండి, పక్క రాష్ట్రమైన ఏపీలోనూ ఎల్‌నినో ఉంది, కానీ అక్కడ చంద్రబాబు ప్రభుత్వం పరిస్థితులను ఎంత పక్కాగా మేనేజ్ చేస్తోంది! అంటూ చంద్రబాబు వైపు కితాబుల వర్షం కురిపిస్తున్నారు.ఈ వ్యూహంలో కేటీఆర్‌కు ఎలాంటి స్వార్థ రాజకీయ స్వార్థం లేకపోవచ్చు. కేవలం తెలంగాణ కాంగ్రెస్‌పై దాడి చేయడమే ప్రధాన ఉద్దేశం కావచ్చు. కానీ, కేటీఆర్ నోటి వెంట వస్తున్న ఈ మాటలు నేరుగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ రాజకీయ మనుగడకు, ప్రతిపక్ష పోరాటానికి పెను శరాఘాతంగా మారుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, కరవును ఎదుర్కోవడంలో చంద్రబాబు చేతులెత్తేశారని వైఎస్సార్సీపీ క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేస్తుంటే.. తెలంగాణ నుంచి జగన్ మిత్రుడే అయిన కేటీఆర్ వచ్చి ఆంధ్రాలో చంద్రబాబు పాలన, వాటర్ మేనేజ్‌మెంట్ బాగుంది అని సర్టిఫికేట్లు ఇవ్వడం వైసీపీ ప్రచారానికి పూర్తిగా గొడ్డలిపెట్టులా మారుతోంది. టీడీపీ నేతలు, మద్దతుదారులు కేటీఆర్ కామెంట్లను ఆయుధంగా మలుచుకుని నెట్టింట విరుచుకుపడుతున్నారు. జగన్ సన్నిహితుడైన కేటీఆర్ కూడా కూటమి ప్రభుత్వ పాలనను మెచ్చుకుంటున్నారు, ఇక జగన్ చెప్పే కల్పిత విమర్శలను ఎవరు నమ్ముతారు? అంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. దీంతో ఏపీలో వైసీపీ నేతలు ప్రతిసారీ కేటీఆర్ వ్యాఖ్యలకు సమర్థన ఇచ్చుకోలేక, అలాగని మిత్రుడిని విమర్శించలేక తీవ్ర మానసిక మథనానికి గురవుతున్నారు. జగన్‌ను కన్ఫ్యూజన్‌లో పడేస్తున్న ఈ కామెంట్లు వైఎస్సార్సీపీ క్యాడర్‌కు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి.రాజకీయంలో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు అనే నానుడితో పాటు సొంత ఇంటి సంక్షోభం ముందర పొరుగువారి స్నేహం ద్వితీయమే అనే సూత్రం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్‌కు ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డిని దెబ్బతీయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మళ్లీ బలమైన పునాదిపై నిలబెట్టడం మాత్రమే ఏకైక ప్రాధాన్యత. అందుకోసం వైరి వర్గమైన చంద్రబాబునైనా సరే మెచ్చుకోవడానికి ఆయన వెనుకాడటం లేదు. ఈ క్రమంలో తన మిత్రుడు జగన్‌కు రాజకీయంగా ఎంత నష్టం జరుగుతోందనే అంశాన్ని కేటీఆర్ పూర్తిగా పక్కన పెట్టేసినట్లే కనిపిస్తోంది. తమ సొంత ప్రయోజనాలు, రాజకీయ వ్యూహాల కోసమే కేటీఆర్ ఆంధ్రాను వాడుకుంటుండటంతో, స్నేహానికి-రాజకీయ అవసరాలకు మధ్య ఉన్న స్పష్టమైన సరిహద్దులు బయటపడ్డాయి. మిత్రుడి ఇబ్బందులను పక్కనపెట్టి కేటీఆర్ సాగిస్తున్న ఈ సెల్ఫ్-పొలిటికల్ గేమ్ రాబోయే రోజుల్లో జగన్-కేటీఆర్‌ల చెలిమిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో, ఏపీ రాజకీయాల్లో వైఎస్సార్సీపీ దీనికి ఎలా కౌంటర్ ఇస్తుందో వేచి చూడాలి.

# వరుస తుఫాన్లు... ఏం జరుగుతోంది

సాక్షర, విజయవాడ: వారం రోజుల వ్యవధిలో ఏర్పడిన రెండు తుఫాన్లు ఏపీలో వర్షాభావాన్ని పూర్తిగా తగ్గించేశాయనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులపై ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు తుఫాన్లు చాలా మేలు చేశాయని విశ్లేషిస్తున్నారు. తుఫాన్ కారణంగా చాలా నష్టం జరిగినప్పటికీ, భారీ వర్షాల కారణంగా వేసవి సవాళ్లను అధిగమించేలా అవకాశం లభించిందని అంటున్నారు. ప్రస్తుతం చేతికందిన పంట కొంతవరకు దెబ్బతిన్నప్పటికీ, రెండో పంటకు పుష్కలంగా నీరు లభించిందని చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇటు రైతుకు అటు ప్రభుత్వానికి నష్టం జరిగినా, ఎల్ నినో ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా బయటపడటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించినట్లేనని అంటున్నారు. ఎల్ నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంది. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో రాష్ట్రంలో దాదాపు 450 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. పంట దిగుబడులు తగ్గిపోతాయనే ఆందోళన ఎక్కువ కావడంతో మార్కెట్లో అనేక రకాల సరకులకు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో ఎన్నడూ లేనట్లు నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబును రాజకీయంగా ఇరుకన పెట్టేందుకు ప్రత్యర్థులు ఈ వాతావరణ పరిస్థితులను కూడా వాడుకుంటున్నారు. రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నేతలతోపాటు తెలంగాణకు చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు సైతం చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వర్షాలు కురవవు అనే సెంటిమెంటు ద్వారా రాజకీయం చేయాలని చూశారని అంటున్నారు. అయితే అనూహ్యంగా గత వారం రోజుల్లో రెండు తుఫాన్లు ఏర్పడటంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితుల నుంచి బయటపడిందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత నెల 28న కోనసీమ తీరాన్ని తాకిన అర్నబ్ తుఫాన్ వల్ల శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలే కురిశాయి. ఈ వర్షాల కారణంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాదాపు 20 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ వర్షాల వల్ల జరిగిన నష్టానికి సమానంగా మేలు కూడా జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదపు కోస్తా ప్రాంతంలో పుష్కలంగా నీరు చేరిందని, అన్ని చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయని చెబుతున్నారు. వాగులు, వంకలు, గెడ్డలు పొంగిపొర్లడంతో రానున్న వేసవికి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం లేదని విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి ఎల్ నినో కారణంగా 2027 జూన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని అంటున్నారు. దీనివల్ల తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. పొరుగున ఉన్న తెలంగాణలో ఇప్పటికే ఈ సమస్య మొదలైందన్న వార్తలు వస్తున్నాయి. అయితే ఏపీకి మాత్రం రెండు తుఫాన్లు తాగునీటి ముప్పు లేకుండా చేశాయని, అదే సమయంలో రబీ పంటలకు సాగునీటి చింత లేకుండా పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. అర్నబ్ కారణంగా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలు కురిస్తే, ఇప్పుడు మురసు తుఫాన్ వల్ల ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం, పల్నాడు జిల్లాలతోపాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక ఈ సీజన్ లో చుక్క నీరు కూడా చేరని పులిచింతల, నాగార్జున సాగర్ కు భారీగా వరద వచ్చే అవకాశం ఉందన్న అంచనాలు ఆ ప్రాజెక్టుల కింద ఉన్న రైతుల్లో ఆశలు రేపుతున్నాయని చెబుతున్నారు. మొత్తానికి ఈ పరిస్థితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరటనిస్తున్నట్లుగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన చంద్రబాబు హయాంలో వర్షాభావ పరిస్థితులు ఎదురవడం అత్యంత సహజమే అయినప్పటికీ ఆయన రాజకీయ ప్రత్యర్థులు ప్రకృతి శాపంగా విమర్శలు చేయడం ద్వారా సీఎంను మానసికంగా ఇబ్బంది పెట్టేవారని అంటున్నారు. అయితే ఈ సారి ప్రకృతి ఇలాంటి విమర్శలకు అవకాశం ఇవ్వకుండా తాను చంద్రబాబు పక్షాన ఉన్నట్లు నిరూపిస్తోందని అంటున్నారు. గత ఆగస్టులో కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలకు కృష్ణా, గోదావరి నదులకు ఒకేసారి వరదలు వచ్చాయి. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు లిఫ్ట్ ద్వారా రాయలసీమకు నీటిని తరలించి ఆ ప్రాంతంలో పంటలను కాపాడగలిగారని అంటున్నారు. ఇదే సమయంలో పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసి కృష్ణా డెల్టాకు కరువు ఛాయలు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఇప్పుడు మిగిలిన ప్రాంతంలోనూ తుఫాను కారణంగా వర్షాలు కురిసి నీటి కొరత లేకుండా పోయిందని విశ్లేషిస్తున్నారు. ఇదంతా గమనిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిస్థితులు అనుకూలిస్తున్నట్లుగా భావించాల్సివస్తోందని అంటున్నారు.



# కొత్త బాదుడుకు తెర తీసిన రెరా




సాక్షర, హైదరాబాద్:హైదరాబాద్ వ్యాప్తంగా నిర్మాణం జరుపుకుంటున్న లగ్జరీ హైరైజ్ అపార్ట్‌మెంట్లలో నివసించాలని సగటు గృహ కొనుగోలుదారులు ఎంతో ముచ్చటపడతారు. కాలుష్యానికి దూరంగా, ఆహ్లాదకరమైన గాలి, వెలుతురుతో పాటు నగర అందాలను పైనుంచి వీక్షించవచ్చనే ఆశతో చాలామంది పై అంతస్తుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతారు. అయితే కొనుగోలుదారుల ఈ ఆశనే బిల్డర్లు వ్యాపార అవకాశంగా మలచుకుని ఫ్లోర్ రైజ్ ఛార్జీలు పేరుతో అదనపు బాదుడు బాదుతుండటం ప్రాపర్టీ మార్కెట్‌లో చర్చనీయాంశమవుతోంది.సాధారణంగా బిల్డర్లు నిర్ణయించే బేసిక్ ఎస్ఎఫ్‌టీ ధర అనేది భవనంలోని దిగువ అంతస్తులకే వర్తిస్తుంది. నిబంధనల ప్రకారం 6వ అంతస్తు నుంచి ప్రారంభించి పైకి వెళ్లే ప్రతి అదనపు అంతస్తుకు చదరపు అడుగుకు రూ. 20 చొప్పున ఫ్లోర్ రైజ్ రుసుముగా అదనంగా జోడిస్తారు. అంటే మీరు భవనంలో ఎంత ఎత్తుకి వెళ్లి, అంత ప్రశాంతతను అనుభవించాలనుకుంటే మీ జేబుకు అంత పెద్ద కన్నం పడుతుందన్న మాట. ఉదాహరణకు 3,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్ కొనుగోలు చేసే వ్యక్తి, 16వ అంతస్తును ఎంచుకుంటే కేవలం ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీల రూపంలోనే రూ. 6.60 లక్షలకు పైగా అదనంగా చెల్లించాల్సి వస్తోంది.ఎత్తైన అంతస్తుల్లో నివసించడం వల్ల మెరుగైన వ్యూ , తక్కువ శబ్దం, పరిశుభ్రమైన గాలి లభిస్తాయని బిల్డర్లు ఈ రుసుములను సమర్థించుకుంటారు. అయితే ఇదే సమయంలో భవనం ఎత్తు పెరిగేకొద్దీ నిర్మాణ వ్యయంలో లిఫ్టుల వేగం, ప్రీమియం గ్లాస్, భద్రతా వ్యవస్థలు , నిర్మాణాత్మక ఇంజనీరింగ్ ఖర్చులు పెరుగుతాయని డెవలపర్లు స్పష్టం చేస్తున్నారు. కానీ ఎలాంటి అదనపు విస్తీర్ణం రాకపోయినా, కేవలం ఎత్తులో ఉందనే ఒకే ఒక్క కారణంతో లక్షల రూపాయల అదనపు భారం మోయాల్సి రావడంపై కొనుగోలుదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.అంతిమంగా చూస్తే ప్రాథమిక ఎస్ఎఫ్‌టీ ధర తక్కువగా కనిపించినప్పటికీ, 15, 20 లేదా 30 అంతస్తుల్లో ఫ్లాట్లను ఎంచుకున్నప్పుడు ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీలే లక్షల రూపాయల్లోకి చేరి కొనుగోలుదారుల మొత్తం బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. దీంతోపాటు ఈ అదనపు ధరపై కూడా జీఎస్‌టీ భారం పడుతుండటం గమనార్హం. అందువల్ల హైరైజ్ ప్రాజెక్టుల్లో ఇళ్లను ఎంచుకునేటప్పుడు కేవలం ఎత్తుకే ప్రాధాన్యమివ్వకుండా, ఈ ఫ్లోర్ రైజ్ ఛార్జీల లెక్కలను ముందే సరిచూసుకుని సరైన అంతస్తును ఎంచుకోవాలని రియల్ ఎస్టేట్ నిపుణులు సూచిస్తున్నారు.

## మొదటి పేజీ తరువాయి నిరుపేద రైతుల భూములు వదిలేయండి

ఎన్నో ఏళ్లుగా రైతులు ఈ భూములపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి భూములను పరిశ్రమల పేరుతో సేకరించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాపోల్-కాడ్లపూర్ గ్రామాల రైతుల తరఫున ఆయన మాట్లాడుతూ, ప్రజలకు, రైతులకు ఉపయోగపడుతున్న సాగుభూములను ప్రభుత్వం బలవంతంగా సేకరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే వ్యవసాయానికి పనికిరాని బీడు భూములను గుర్తించి సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ప్రస్తుత ప్రతిపాదిత భూములనే సేకరించాల్సిన పరిస్థితి ఉంటే, రైతులకు నష్టం కలగకుండా మరోచోట ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించాలని కోరారు. రైతుల జీవనాధారమైన వ్యవసాయ భూములను కోల్పోయే పరిస్థితి రాకుండా ప్రభుత్వం మానవీయ దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి ఎంత ముఖ్యమో, రైతుల సంక్షేమం కూడా అంతే ముఖ్యమని బక్కని నర్సింహులు పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా భూసేకరణ చేపట్టడం సరికాదని, రాపోల్-కాడ్లపూర్ రైతుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## మొదటి పేజీ తరువాయి మల్లారెడ్డి ఫాం హౌస్ తొలగింపు

ఎఫ్‌టీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన దాదాపు అర కిలోమీటరు పొడవైన కట్టను, దానికి ఆనుకుని ఉన్న గోడలను, ఇనుప ఫెన్సింగ్‌ను ఆపరేషన్‌లో భాగంగా పూర్తిగా తొలగించారు. కూల్చివేతల సమయంలో సుప్రీంకోర్టు న్యాయవాది సౌరభ్ రాజ్ వర్మ హైడ్రా చర్యలను అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిసింది. అయితే, సంఘటనా స్థలంలోనే ఉన్న అధికారులు చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా చూపించి, కూల్చివేతను కొనసాగించారు. ఫాక్స్ సాగర్ చెరువును ఆక్రమణల నుండి రక్షించి, పూర్వ వైభవం తీసుకురావడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యలపై మల్లారెడ్డి కుటుంబం ఎలా స్పందిస్తుందో, హైడ్రా తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయో వేచి చూడాల్సి ఉంది.తెలంగాణ నీటిపారుదల శాఖ నిబంధనల ప్రకారం చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) పరిధిలో ఎలాంటి నిర్మాణాలు, మట్టి నింపడాలు చేయడానికి వీల్లేదు. అలాగే ఎఫ్‌టీఎల్ సరిహద్దు నుంచి 30 మీటర్ల వరకు బఫర్ జోన్‌గా పరిగణిస్తారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడటానికి, వరద ముప్పును నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం 'హైడ్రా'ను ప్రత్యేక అధికారాలతో ఏర్పాటు చేసింది.

# ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ..



- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- పాత భవనానికి మరమ్మతులు.. మార్చురీ ఏర్పాటు
- నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి కృషి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర):ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచి, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.అనంతరం రక్త పరీక్షల విభాగం, మందుల పంపిణీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఆసుపత్రి భవనం పాతదైన నేపథ్యంలో అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో మార్చురీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన ప్రతిపాదనలు, చర్యలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరాన్ నౌక హైజాక్..

- రంగంలోకి ఇండియన్ నేవీ..
- 20మంది సిబ్బంది రెస్క్యూ

అరేబియా సముద్రంలో సముద్రపు దొంగల చేతికి చిక్కిన ఇరాన్‌కు చెందిన ఫిషింగ్ నౌక 'అజిని'ని ఇండియన్ నేవీ సురక్షితంగా విడిపించింది. ఈ ఆపరేషన్‌లో నౌకలో ఉన్న మొత్తం 20 మంది సిబ్బందిని క్షేమంగా రక్షించింది. సోమాలియా ఈశాన్య తీరానికి సమీపంలో సాయుధ దొంగలు ఈ నౌకను హైజాక్ చేశారు. దీనిపై 48 గంటల పాటు భారత నేవీ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. INS కోల్‌కతా నేతృత్వంలో సముద్ర నిఘా విమానాల సహకారంతో ఈ ఆపరేషన్ కొనసాగింది. భారత వాయుసేనకు చెందిన C-17 విమానం ద్వారా మెరైన్ కమాండోలను కచ్చితమైన ఎయిర్‌డ్రాప్ పద్ధతిలో రంగంలోకి దించారు. అనంతరం నౌకను తమ ఆధీనంలోకి తీసుకుని, 20 మంది సిబ్బందిని సురక్షితంగా విడిపించారు. ఈ ఆపరేషన్‌లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకుండా, ప్రాణనష్టం జరగకుండా అందరినీ కాపాడారు. సాహసోపేత ఆపరేషన్‌పై భారత నౌకాదళం, వాయుసేనకు న్యూఢిల్లీలోని ఇరాన్ ఎంబసీ కృతజ్ఞతలు తెలిపింది.

# వేగంగా మెట్రో పనులు



సాక్షర,హైదరాబాద్: హైదరాబాద్ ప్రజలకు కేంద్రం శుభవార్త అందించింది. హైదరాబాద్ మెట్రో విస్తరణ ప్రాజెక్టుపై కీలక అప్డేట్ వచ్చేసింది. మెట్రో సెకండ్ ఫేజ్ చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసిన విషయం తెలిసిందే. ఎల్‌అండ్‌టీ సంస్థ నుంచి మెట్రోను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా.. ఈ క్రమంలో రెండో విడత ప్రాజెక్టును షురూ చేసింది. ఇప్పటికే దీనికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం అందించగా.. డీపీఆర్, రూట్ మ్యాప్ కూడా ఖారారు అయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం రూ.275 కోట్లు మంజూరు చేసింది. రూ.150 కోట్లు విస్తరణ పనుల కోసం అందించగా.. రూ.125 కోట్ల రుణాల చెల్లింపు కోసం కేటాయించింది.

హైదరాబాద్ మెట్రో రెండో దశపై అప్డేట్..

కేంద్రం నిధులు మంజూరు చేయడంతో హైదరాబాద్ మెట్రో రెండో దశపై మరో ముందడుగు పడినట్లయింది. పనులు త్వరగా ప్రారంభం కావడానికి ఇది ఊతమివ్వనుంది. ఇప్పటికే పరిపాలనాపరమైన అనుమతులు రావడంతో త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశముంది. రెండో విడతలో భాగంగా 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మేర విస్తరించనుండగా.. రూ.38,595 కోట్ల వ్యయం అవుతుందని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ సమర్పించింది. ఈ ఏడాది మేలో డీపీఆర్ సమర్పించగా.. కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే సెకండ్ ఫేజ్‌కు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తూ వస్తూన్నారు. పలుమార్లు కేంద్ర పెద్దలను కలిసిన రేవంత్.. హైదరాబాద్ మెట్రో విస్తరణకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ క్రమంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంది.

ఈ ప్రాంతాలకు మెట్రో సేవలు..

రెండో దశలో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, కోకాపేట నియోపోలిస్, చంద్రాయణగుట్ట ప్రాంతాలకు మెట్రోను విస్తరించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఇక మియాపూర్ టూ పటాన్‌చెరు, ఎల్బీనగర్ టు హయత్ నగర్, మేడ్చల్ టూ శామీర్ పేట్ వంటి మార్గాలు ఉన్నాయి. ఈ రూట్లు పూర్తయితే హైదరాబాద్‌లో ప్రయాణ కష్టాలు కాస్త తొలగిపోయే అవకాశముంది. నగర ప్రజలకు ట్రాఫిక్ రద్దీ లేని మెరుగైన ప్రయాన సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణం మరింత సులభతరం అవుతుంది. అయితే మెట్రో విస్తరణ కోసం భారీగా నిధులు అవసరం కానున్నాయి. దీంతో పాటు అనుమతులు, నిర్మాణ ఒప్పందాలు పూర్తి కావల్సి ఉంటుంది. కాగా అప్పుల భారంతో మెట్రోను నిర్వహించలేక ఎల్‌అండ్‌టీ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో మెట్రోను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంది. దీనికి సంబంధించి చట్టపరమైన ప్రక్రియగా కూడా పూర్తి అవుతున్నాయి.

## మొదటి పేజీ తరువాయి నవంబర్ 3న అమెరికాలో మధ్యంతర ఎన్నికలు

అనే వివరాలు చూద్దాం. అమెరికాలో నాలుగేళ్లకు ఓసారి అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయనే సంగతి తెలిసిందే. ఈ నాలుగేళ్ల పదవీకాలంలో సరిగ్గా సగం పూర్తవగానే జరిగే చట్టసభల ఎన్నికలనే మధ్యంతర ఎన్నికలు అని పిలుస్తారు. అధ్యక్షుడి పాలన పట్ల ప్రజలు ఇచ్చే రెఫరెండంలా దీన్ని భావించొచ్చు. మన దగ్గర లోక్ సభ, రాజ్యసభ ఉన్నట్లే.. అమెరికా పార్లమెంట్‌లోనూ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్ ఉంటాయి. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రతినిధుల సభ లేదా దిగువ సభ)లో 435 స్థానాలు ఉండగా.. సెనేట్‌లో మొత్తం 100 స్థానాలు ఉంటాయి. దిగువ సభ సభ్యులు పదవీ కాలం రెండేళ్లు. కాబట్టి మధ్యంతర ఎన్నికల్లో మొత్తం 435 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మన రాజ్యసభ సభ్యుల్లాగే సెనేటర్ల పదవీ కాలం ఆరేళ్లు ఉంటుంది. సెనేట్‌లో మూడో వంతు స్థానాలకు ప్రతి రెండేళ్లకు ఓసారి ఎన్నికలు జరుగుతాయి. దిగువ సభలో జనాభా ఆధారంగా రాష్ట్రాలకు సీట్లను కేటాయిస్తే.. సెనేట్‌లో ప్రతి రాష్ట్రానికి రెండు చొప్పున సీట్లు ఉంటాయి.. దిగువ సభ పదవీ కాలం రెండేళ్లే.ఈసారి మధ్యంతర ఎన్నికల సమయంలో దిగువ సభలోని 435 స్థానాలతోపాటు ఎగువ సభలోని 35 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అమెరికా ఎన్నికల నిబంధనల ప్రకారం జాతీయ స్థాయి ఎన్నికలను నవంబర్ నెల మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం రోజున నిర్వహిస్తారు. ఈసారి నవంబర్ నెలలో మొదటి సోమవారం రెండో తేదీన వస్తుంది. మంగళవారం నవంబర్ 3న వస్తోంది. కాబట్టే ఆ రోజే అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి.

# జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసిన అసిస్టెంట్ కలెక్టర్ హరిప్రసాద్



(ఆదిలాబాద్, సాక్షర):కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనింగ్) ఎన్. హరి ప్రసాద్ మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా పరిపాలన, పాలనాపరమైన అంశాలు, క్షేత్రస్థాయి శిక్షణ అనుభవాలపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ హరి ప్రసాద్ ను అభినందించిన జిల్లా కలెక్టర్, శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలందించే అధికారిగా రాణించాలని ఆకాంక్షించారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపై ప్రభుత్వ ఉక్కుపాదం




సాక్షర,హైదరాబాద్:
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొందరు ప్రైవేట్ ట్యాంకర్ల యజమానులు ఎలాంటి నియంత్రణ లేకుండా బోర్లు తవ్వుతూ భూగర్భ జలాలను యథేచ్ఛగా తోడేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రింబవళ్లు నీటిని పెద్ద పెద్ద ట్యాంకర్లలో నింపి, ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ లక్షల రూపాయలు వెనకేసుకుంటున్నారని అధికారులు గుర్తించారు. రాబోయే వేసవి పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని భూగర్భ జలాల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వాల్టా చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా నీటిని తోడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.ఇందులో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి నిబంధనలను కఠినతరం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. భారీగా నీటిని తరలించే ట్యాంకర్లకు ఔటర్ రింగ్ రోడ్డుపై అనుమతుల విషయంలో ఆంక్షలు విధిస్తూ, సంబంధిత జలమండలి, హెచ్ఎండబ్ల్యూఎస్, హైడ్రా, ఔటర్ రింగ్ రోడ్డు అధికారులకు నోటీసులు జారీ చేశారు.అయితే ప్రభుత్వ నిర్ణయంతో తమ వ్యాపారాలకు భారీగా నష్టం వాటిల్లుతుందని భావిస్తున్న కొందరు ట్యాంకర్ల యజమానులు అధికారుల చర్యలను వ్యతిరేకిస్తున్నారు. 'మా దగ్గర డబ్బులు ఉన్నాయి.. నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు.. మీకెందుకు అభ్యంతరం?' అంటూ అధికారుల తీరుపై ప్రశ్నలు సంధిస్తున్నారు. మరోవైపు ప్రజల తాగునీటి అవసరాలు, భూగర్భ జలాల పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యత అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అక్రమ నీటి వ్యాపారానికి అడ్డుకట్ట వేసి, భవిష్యత్తు తరాలకు నీటి వనరులను కాపాడటమే లక్ష్యంగా చర్యలు కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నారు

## మొదటి పేజీ తరువాయి మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

డిసెంబరు 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ నేపథ్యంలో ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు సీతక్క వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తలతో పాటు పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, ఇతర కీలక భాగస్వాములకు ఇందులో భాగస్వామ్యం కల్పించినట్లు తెలిపారు. మహిళలు ప్రారంభించిన వ్యాపారాలకు పెట్టుబడులు సమకూర్చడం, కొత్త మార్కెట్లను పరిచయం చేయడం, వ్యాపార విస్తరణకు అవసరమైన ప్రభుత్వ విధానపరమైన మద్దతు అందించడం వంటి అంశాల్లో ఈ కౌన్సిల్ కీలక పాత్ర పోషించనుంది.మహిళా పారిశ్రామిక రంగంలో ప్రస్తుతం ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలను సమగ్రంగా విశ్లేషించి ప్రత్యేక శ్వేతపత్రాన్ని రూపొందించనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ శ్వేతపత్రాన్ని గ్లోబల్ సమిట్‌లో విడుదల చేస్తామని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థికంగా, సాంకేతికంగా, విధానపరంగా ఎలాంటి సహకారం అవసరమో ఇందులో పొందుపరచనున్నారు. కౌన్సిల్ కన్వీనర్ పల్లచోళ్ల సీతతో పాటు పలువురు ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఇదిలా ఉండగా.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నవీన్ మిత్తల్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పరిపాలనా బాధ్యతలను ఆయన చేపట్టారు.

# సాగునీరు ఇవ్వకుండా పంటలు వద్దంటే రైతు బతుకేది ఎలా..?



- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకు రాజ్యం

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): రైతులకు సాగునీరు అందించలేని ప్రభుత్వం పంటల సాగు చేయవద్దని సూచిస్తే రైతు కుటుంబాల జీవనాధారం ఏమిటి అని నిర్మల్ జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు చెరుకు రాజ్యం ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలల పాటు రైతుల పంటలు వేయకుండా ఉంటే వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని, రైతులకు మూడు నెలలపాటు భరోసా కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆ భరోసా ఎలా ఇస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఎంత ఆర్థిక సాయం అందిస్తుంది, ఎప్పుడు అందిస్తుంది అనే విషయాలపై స్పష్టమైన సమాధానం రైతులకు ఇవ్వాలని అన్నారు.రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది, వ్యవసాయం బతికితేనే దేశం బతుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## మొదటి పేజీ తరువాయి పైరేట్స్ మట్టి కరిపించిన ఇండియన్ నేవీ

నౌక తూర్పు వైపు వాణిజ్య మార్గాల దిశగా కదులుతుండటంతో భారత నావికాదళం వెంటనే చర్యలు చేపట్టింది. భారత నావికాదళ యుద్ధనౌక INS కొల్‌కత్తా సహా సముద్ర నిఘా విమానం (P-8I) సహాయంతో నౌకను గుర్తించి దాని కదలికలను నిరంతరం పర్యవేక్షించింది. నౌక తప్పించుకోకుండా క్యాలిబ్రేటెడ్ నాన్-కైనెటిక్ చర్యలతో అడ్డుకుంది.భారత వైమానిక దళం సి-17 విమానం ద్వారా మెరైన్ కమాండోలు (మార్కోస్)ను పారాడ్రాప్ చేసి త్వరితగతిన ఆపరేషన్ పూర్తి చేశారు. నవంబర్ 2న ఈ ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. దొంగల నుంచి భారీ సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ముంబై నుంచి 3,000 కి.మీ.కు పైగా దూరంలో జరిగింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ విజయాన్ని అభినందిస్తూ, మూడు వేల కిలోమీటర్ల దూరంలో 48 గంటల సమన్వయ ఆపరేషన్‌లో అజిని నౌకలోని 20 మంది సిబ్బందిని సాయుధ దొంగల నుంచి సురక్షితంగా రక్షించిన భారత నావికాదళానికి అభినందనలు తెలిపారు.భారత వైమానిక దళం సకాలంలో అందించిన సహకారంతో జరిగిన ఈ చర్య నావికాదళం యొక్క అధిక ఆపరేషనల్ రెడీనెస్‌ను చూపిస్తుందని పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్రయాన సిబ్బంది భద్రత, కీలక వాణిజ్య మార్గాల రక్షణ, సురక్షితమైన సముద్ర వాతావరణం నిర్ధారణకు భారత నావికాదళం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ భారత నౌకాదళ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.

## మొదటి పేజీ తరువాయి మురసు ఎఫెక్ట్..తెలంగాణకు వర్ష గండం..

వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకోవడం, పలు జిల్లాల్లో వరి కోతలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియలు కొనసాగుతుండటంతో ఈ అకాల వర్ష సూచన రైతాంగాన్ని కలవరపెడుతోంది. ఆకస్మిక ఈదురుగాలులు, తేలికపాటి వర్షాల వల్ల ఆరుబయట ఆరబెట్టిన ధాన్యం, కల్లాల్లోని పంట తడిసిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. రైతులు తగిన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టి, ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పి భద్రపరుచుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద, పాత భవనాల వద్ద ఉండొద్దని ప్రజలను అప్రమత్తం చేశారు.ఏపీలో తుఫాన్ తన ప్రతాపం చూపిస్తుంది. పోలవరం, కాకినాడ, ఎస్టీఆర్, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మన్యం, తూగో, పగో, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడతాయని వెల్లడించింది. వర్షాలు ఈదురుగాలులతో ఇప్పటికే పలుచోట్ల చెట్లు విరిగిపడడంతో పాటు పంటలు నీటమునిగాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తుఫాన్ అనునిత్యం అప్రమత్తంగా ఉన్నట్లు ఏపీ సర్కార్ తెలిపింది. పంట నష్ట వివరాలను సేకరించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ప్రకటించింది.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో కొత్త నియామకాలు




- 7 మందికి కీలక బాధ్యతలు అప్పగింత
- జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ

(మంచిర్యాల, ప్రతినిధి):తెలంగాణ రాజ్యాధికార పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మంచిర్యాల జిల్లా కమిటీలో నూతన నియామకాలు చేపట్టారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మాదం రజిని కుమార్ సూచనలతో మంచిర్యాల జిల్లా కమిటీలో వివిధ బాధ్యతలను అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా - పుట్ట లావణ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులుగా తగరం రాజేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా వాసాల అనిల్ కుమార్ , జిల్లా కార్యదర్శిగా భీమిని రమేష్ , జిల్లా కార్యదర్శిగా పడాల శివతేజ , రైతు విభాగం అధ్యక్షులుగా ఇప్ప కిషోర్ ,జిల్లా సలహాదారులు బూర రవీందర్లను జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ నియమించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అణగారిన వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం, అధికారం కల్పించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పదవులు అనేవి అలంకారప్రాయంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతలుగా భావించాలని, నూతనంగా నియమితులైన నాయకులందరూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మొదటి పేజీ తరువాయి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ఈ-లాటరీ ని ప్రారంభించిన మంత్రి పొన్నం

అర్బన్ ప్రాంతాల్లో ల్యాండ్ అవైలబిలిటీ సమస్య మరియు కన్స్ట్రక్షన్ కాస్ట్ తేడా కారణంగా, నియోజకవర్గాల్లోనే స్థలాలు ఉన్నవారికే ఆ స్థలంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అర్హులైన పేదలందరికీ, ముఖ్యంగా సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోవాలనుకునే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

## మొదటి పేజీ తరువాయి కేంద్ర ఉద్యోగులకు పెరగనున్న డీఏ

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావాన్ని తగ్గించి, ఉద్యోగులు, పింఛనుదారులకు ఆర్థిక ఊరట కల్పించడం ఈ నిర్ణయం ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు జనవరి 1, జూలై 1 తేదీల నుంచి అమలయ్యేలా డీఏ, డీఆర్ రేట్లను సవరిస్తుంది. అయితే తాజా పెంపు అమలు తేదీ, బకాయిల చెల్లింపుపై తుది స్పష్టత కోసం అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది.

## మొదటి పేజీ తరువాయి కేసీఆర్‌పై పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

అన్ని గ్రామాల్లో భూసర్వే చేయాలి. రాష్ట్రంలో 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు ఇచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు. 120 సంవత్సరాల క్రితం భూముల సర్వేలు జరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి అంగుళం సర్వే చేసి భూములు ఉన్న వారికి పూర్తి భరోసా కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. పాలేరు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో భూసర్వే చేయాలని కలెక్టర్‌ను ఆదేశించామని అన్నారు. మ్యాపులతో కూడిన సర్వేతో ఆధార్ ఎలా ఉందో.. భూదార్ కూడా అలానే ఉండేలా ప్రతి భూస్వామికి ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థులతో లెక్కలు చేయించిన కలెక్టర్

- ప్రతిభ కనబరిచిన వారికి పెన్నులు బహుమతి
- ముధోల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర):ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.మంగళవారం ముధోల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించి, శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ భవనం స్థానంలో నూతన అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యతో పాటు విద్యా బోధనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా ముచ్చటించారు.ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని, స్నేహితులు ఎవరైనా బడికి రాకపోతే వారిని కూడా పాఠశాలకు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు గణితంలో సులభంగా లెక్కలు చేయగలిగే మెలకువలను వివరించి, వారితో పలు లెక్కలు చేయించారు. ఇంగ్లీష్ పదాలను వ్యతిరేక క్రమంలో చదివించి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు.విద్యార్థులు చూపిన ప్రతిభకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. పలువురు విద్యార్థులకు పెన్నులను బహుమతులుగా అందించి ప్రోత్సహించారు. ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థుల ప్రతిభ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తనిఖీలో జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవకుమార్, డీఎల్పీవో లక్ష్మణ్, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విదేశాల్లో ఉద్యోగం పేరుతో రూ.2 లక్షల మోసం ... నిందితుడి అరెస్ట్



(ఇచ్చోడ, సాక్షర):విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.2 లక్షలు మోసం చేసిన నిందితుడిని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ వి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇచ్చోడ మండలం జామిడి గ్రామానికి చెందిన పిలవన్ శ్యామ్ అనే యువకుడు 2024లో హైదరాబాద్ లో ఎయిర్ హోస్టెస్ కోచింగ్ కోసం వెళ్లిన సమయంలో అమీర్ పేటలోని హ్యాష్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ గురించి తెలుసుకున్నాడు.అక్కడ పనిచేస్తున్న గోచిపాతుల అనిల్ కుమార్ అనే వ్యక్తి విదేశాల్లో ఉద్యోగ వీసా ఇప్పిస్తానని, అందుకు రూ.2 లక్షలు అవసరమని చెప్పడంతో బాధితుడు నమ్మి 2026 ఏప్రిల్ 18 నుండి జూన్ 11 వరకు విడతల వారీగా ఫోన్ పే ద్వారా మొత్తం రూ.2 లక్షలు చెల్లించాడు.అనంతరం నిందితుడు బాధితుడికి వాట్సాప్ ద్వారా ఆఫర్ లెటర్, సింగపూర్ రావడానికి ఆఫర్ కార్డు పంపించాడు. అయితే వాటి నిజానిజాలపై అనుమానం వచ్చిన బాధితుడు సింగపూర్ ప్రభుత్వ వెబ్ సైట్ లో పరిశీలించగా ఎలాంటి వివరాలు లభించలేదు.నిందితుడిని సంప్రదించగా సరైన సమాధానం ఇవ్వకుండా ఫోన్ లకు స్పందించడం మానివేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 465/2026, సెక్షన్ 318(4) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
గోచిపాతుల అనిల్ కుమార్ (28), తండ్రి శ్రీను, స్వస్థలం ప్రకాశం జిల్లా పండలపాడు మండలం కందుకూరు గ్రామం, ప్రస్తుతం హైదరాబాద్.ఈ సందర్భంగా ప్రజలు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే కన్సల్టెన్సీలు, వ్యక్తులను నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వారి వివరాలు మరియు పత్రాల నిజానిజాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ఎస్ హెచ్ ఓ సూచించారు.

# మళ్లీ తెరపైకి రాజీనామాతో రాజ్ గోపాల్ రెడ్డి



సాక్షర, నల్గొండ: మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి రేవంత్ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. తన నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూపాయి నిధులు ఇవ్వడం లేదని, చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ.. నియోజకవర్గ ప్రయోజనాల కోసం అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమంటూ బహిరంగంగా ప్రకటన చేశారు. మునుగోడులో కనీసం రోడ్డు వేసుకోవడానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి నిధులు ఇవ్వడం లేదు.. నేను ఎవరికీ భయపడను, ఎవరితోనూ రాజీపడను అంటూ ఆయన నేరుగా ముఖ్యమంత్రిపైనే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.పైకి నియోజకవర్గ నిధులు, అభివృద్ధి పనుల కొరతను కారణంగా చూపుతున్నప్పటికీ.. రాజగోపాల్ రెడ్డి అసహనం వెనుక సుదీర్ఘకాలంగా రగులుతున్న అసంతృప్తి జ్వాలలు ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశపడుతూ వచ్చారు. ఆ అవకాశాలు కనిపించడం లేదు. ఈ అసంతృప్తికి తోడు, ఇటీవల డియల్ రోడ్డు ప్రాజెక్టు కాంట్రాక్ట్ వివాదం రాజగోపాల్ రెడ్డికి మరింత తలనొప్పిగా మారింది. తన సొంత వ్యాపార, నిర్మాణ ప్రయోజనాలకు సంబంధించిన పనుల్లోనూ ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం అందకపోవడం, రాజకీయంగా తనను ఉద్దేశపూర్వకంగా అణగదొక్కుతున్నారనే భావన ఆయనను ఆందోళనకు గురిచేసింది.ఓ వైపు సొంత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రాజకీయ ప్రాధాన్యత దక్కకపోవడం, మరోవైపు వ్యాపార కాంట్రాక్టుల విషయంలోనూ నిరాశే ఎదురుకావడంతో ఆయన నిప్పుల మీద నడుస్తున్నంతగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలా అన్ని వైపుల నుంచీ అసంతృప్తి పెరగడంతో ఇక సర్దుకుపోయే ప్రసక్తే లేదని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికే రాజగోపాల్ రెడ్డి మానసికంగా సిద్ధపడినట్లు కనిపిస్తోంది.గతంలోనూ పార్టీపై అసంతృప్తితో ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉప ఎన్నికకు వెళ్లిన చరిత్ర ఆయనకుంది; ఇప్పుడు మరోసారి రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి తీవ్రమైన హెచ్చరికలు పంపారు. నిధులు, మంత్రి పదవి, కాంట్రాక్ట్ వివాదాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వేసే అడుగులు రాజీనామా దిశగా ఉండే అవకాశం ఉంది.

# వారిని సస్పెండ్ చేయవద్దు..

- మంత్రి శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చురకలు

సాక్షర, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. పెద్దపల్లి జిల్లా రాజకీయాల్లో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ మధ్య విభేదాలు తాజాగా తెరపైకి వచ్చాయి. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన రాహుల్ గాంధీ సభకు హాజరుకాని ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాకూర్, విజయరమణారావులపై సస్పెన్షన్ వేటు వేయొద్దంటూ మంత్రి శ్రీధర్‌బాబుకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ వ్యంగ్యంగా లేఖ రాయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. గతంలో పిల్లలకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినందుకు నేతలను సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు సభకు రాని నేతలపైనా అదే చర్య తీసుకోవద్దంటూ ఆయన చురకలు అంటించారు. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన భారీ సభకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అయితే ఈ సభకు ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాకూర్, విజయరమణారావుతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు కూడా హాజరుకాలేదనే అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ రాసిన లేఖ పార్టీలో చర్చకు దారితీసింది. గతంలో కాకా ట్రస్టు ఆధ్వర్యంలో ఓ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినందుకు ఓ మహిళా ప్రజాప్రతినిధితో పాటు కాంగ్రెస్ కార్యకర్తలపై సస్పెన్షన్ వేటు వేసిన విషయాన్ని వంశీకృష్ణ తన లేఖలో ప్రస్తావించారు. పిల్లలకు మంచి పని చేసినందుకే వారిపై చర్యలు తీసుకున్నారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. అదే తరహాలో ఢిల్లీలో రాహుల్ గాంధీ నిర్వహించిన సభకు హాజరుకాని శ్రీధర్‌బాబు, మక్కన్ సింగ్ ఠాకూర్, విజయరమణారావులను కూడా సస్పెండ్ చేయాలని కోరాలా? అంటూ చురకలు అంటించారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ, నాయకుల బాధ్యతలు, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ.. సభకు హాజరుకాని నేతలపై చర్యలు తీసుకోవాలనే వాదనను వ్యంగ్యంగా ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్‌బాబుకు రాసిన ఈ లేఖ ద్వారా పార్టీలోని అంతర్గత పరిస్థితులపై తన అసంతృప్తిని వంశీకృష్ణ వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ వర్గాల మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ లేఖతో ఆ విభేదాలు మరోసారి చర్చకు వచ్చాయి. అసలే ప్రజల్లో పార్టీ నాయకులపై వ్యతిరేకత ఉందని భావిస్తున్న తరుణంలో.. నేతల మధ్య అంతర్గత విభేదాలు పార్టీకి ఇబ్బందికరంగా మారుతున్నాయని కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

# రైతు గర్జన ముగిసినా.. మరువని బాధ్యత



- పంట క్షేత్రంలో మాజీ మంత్రి జోగు రామన్న

(జైనథ్/ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా రైతుల సమస్యలపై మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో నిర్వహించిన రైతు గర్జన కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకున్న అనంతరం, మంగళవారం జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామంలో ఉన్న తన సొంత వ్యవసాయ పొలాన్ని జోగు రామన్న సందర్శించారు.ఎలినో ప్రభావంతో పంటల ఎదుగుదలపై నెలకొన్న పరిస్థితులను నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా పత్తి పంట ఎదుగుదలతో పాటు పత్తి కాయల పరిస్థితిని నిశితంగా గమనించి, వ్యవసాయ పరిస్థితులపై ఆరా తీశారు.రాజకీయ కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ, మరోవైపు తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తూ పంటల పరిస్థితులపై దృష్టి సారించడం విశేషం.రైతుల కష్టాలు, వ్యవసాయ సమస్యలపై కేవలం రాజకీయ వేదికలపైనే కాకుండా, క్షేత్రస్థాయిలోనూ తనకు ఉన్న అవగాహన, వ్యవసాయంపై ఉన్న మక్కువ, రైతుల పట్ల తనకున్న చిత్తశుద్ధిని జోగు రామన్న మరోసారి చాటుకున్నారు.

# నకిలీ నంబర్ ప్లేట్ తో వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తి అరెస్ట్



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర): ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న రెండవ పట్టణ పోలీసులకు నకిలీ నంబర్ ప్లేట్ తో వస్తున్న హోండా యాక్టివా పట్టుబడింది. టీఎస్ 01 ఈఆర్ 4975 నంబర్ ను తనిఖీ చేయగా, వాహనం ఛాసిస్ నంబర్ తో సరిపోలకపోవడంతో నకిలీ నంబర్ ప్లేట్ గా గుర్తించారు.ఈ ఘటనలో రాథోడ్ సాయినాథ్ (29), సుంకిడి గ్రామం, సిరికొండ మండలం, ప్రస్తుతం ఆదిలాబాద్ నివాసిని అదుపులోకి తీసుకొని, హోండా యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై క్రైమ్ నంబర్ 748/2026, సెక్షన్లు 318(4), 340(2) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి, నిందితున్ని మంగళవారం అరెస్టు చేయడం జరిగిందని టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు తెలిపారు.వాహనదారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ నంబర్లతోనే వాహనాలు నడపాలని, నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

# విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ రాజర్షి షా



- గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ.
- విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల పరిశీలన

(గుడిహత్నూర్ /ఆదిలాబాద్, సాక్షర):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.మంగళవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల హాజరు శాతం, మౌలిక వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు.మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? భోజనం రుచిగా ఉంటుందా? నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, భోజన తయారీ, సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నిర్వాహకులను హెచ్చరించారు.అనంతరం వంటశాల, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో సాగు చేస్తున్న వివిధ రకాల కూరగాయల మొక్కలను తిలకించారు. కిచెన్ గార్డెన్‌లో పండించిన తాజా కూరగాయలను విద్యార్థుల భోజనానికి వినియోగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి తోటల ద్వారా విద్యార్థులకు ప్రకృతి, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.అనంతరం పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలు, ప్రాజెక్టులను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన యోగా, మ్యూజిక్ రూమ్‌లను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకత, శారీరక, మానసిక వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల మాక్ పార్లమెంట్ పోటీల్లో గుడిహత్నూర్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలవడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తన చేతుల మీదుగా సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తహసీల్దార్ కవితారెడ్డి, ఏపీఎం సుజాత, సర్పంచ్ ఆడే శీల, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో నేడు ఎస్పీ ప్రజావాణి



- ఎస్పీ డా. జానకి షర్మిల


(నిర్మల్, ప్రతినిధి, సాక్షర):జిల్లా ప్రజల సమస్యలు, ఫిర్యాదులను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బుధవారం భైంసాలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.ఈనెల 4వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భైంసా క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు పోలీస్ శాఖ వెల్లడించింది.తమ సమస్యలపై నేరుగా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయదలచిన ప్రజలు నిర్ణీత సమయంలో క్యాంప్ కార్యాలయానికి రావాలని సూచించింది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురావాలని పోలీస్ శాఖ కోరింది.

# ఢిల్లీలో ఏఐసీసీ ఇన్ చార్జ్ కృష్ణ అల్వార్ తో ఆదిలాబాద్ కాంగ్రెస్ నేతల భేటీ



(ఆదిలాబాద్, సాక్షర):ఢిల్లీలోని జనపథ్ లో ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో బీహార్ రాష్ట్ర ఏఐసీసీ ఇన్ చార్జ్ కృష్ణ అల్వార్ ను ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు

# అల్పపీడనం నుంచి సూపర్ తుపాను వరకు...





సాక్షర, హైదరాబాద్ :మురసు.. అర్నబ్.. హుద్ హుద్.. తిత్లీ.. మొంథా.. ఒగ్ని.. ఈ పేర్లు వినే ఉంటారు కదా..!గత కొన్నేళ్లలో వచ్చిన తుపానుల పేర్లు ఇవి.వీటన్నింటికీ ఒక పోలిక ఉంది. అదేంటని అనుకుంటున్నారా...! ఇవన్నీ అక్టోబరు, నవంబరు నెలలో సంభవించాయి.

ఏటా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపానులలో ఎక్కువగా ఈ రెండు నెలల్లోనే ఉంటున్నాయని భారత వాతావరణ శాఖ చెబుతోంది.ఇంతకీ అక్టోబరు, నవంబరు నెలల్లోనే ఎక్కువగా తుపానులు ఏర్పడ్డానికి కారణమేమిటనే విషయంపై భారత వాతావరణ శాఖ, ఇన్ కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఒషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ) ఈ తుపానులు ఏర్పడటంలో సముద్ర ఉష్ణోగ్రతలు కీలక పాత్ర పోషిస్తాయని అని ఇన్ కాయిస్ శాస్త్రవేత్త బి.శివయ్య చెప్పారు.భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. 1891 నుంచి 2025 మధ్య బంగాళాఖాతంలో వాయుగుండాలు, తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 1261 ఏర్పడ్డాయి.వీటిల్లో ఎక్కువగా రెండు నెలల కాలంలో.. అంటే అక్టోబరు, నవంబరులోనే వచ్చాయి.అంతేకాదు, ఈ రెండు నెలల్లో వచ్చే తుపానుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంది. బంగాళాఖాతంలో 1891 నుంచి 2025 వరకు తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 541 వచ్చినట్లుగా భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇందులో అక్టోబరులో 96, నవంబరులో 126లో ఏర్పడ్డాయి.అలాగే 1891 నుంచి 2025 మధ్య తీవ్ర తుపానులు 247 ఏర్పడగా.. అక్టోబరులో 44, నవంబరులో 76 వచ్చాయి. తుపానుల విషయంలో సముద్ర ఉష్ణోగ్రతలలు, గాలుల గమనం తీరు కీలకంగా మారతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.నైరుతి రుతుపవనాల తిరోగమనం(పోస్ట్ మాన్ సూన్) తర్వాత తుపానులు ఎక్కువగా తూర్పు తీరం వైపున ఏర్పడుతుంటాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న చెప్పారు.''పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు అండమాన్ కింద నుంచి బంగాళాఖాతంలోకి వచ్చి చేరుతుంటాయి.రుతుపవనాల ముందు మయన్మార్ తీరంలో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుంటాయి. దానివల్ల అటువైపు తుపానులు వెళుతుంటాయి.కానీ, రుతుపవనాల తిరోగమనం తర్వాత బంగాళాఖాతంలో తూర్పు తీరంవైపు సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. దానివల్ల తూర్పు తీరంవైపు తుపానుల గమనం ఉంటుంది. ఇందుకు గాలుల గమనం కూడా సహకరిస్తుంది '' అని చెప్పారు నాగరత్న.ఈ సమయంలో బంగాళాఖాతంలో సముద్రపు ఉష్ణోగ్రతలు సగటున 26.5 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటాయని వివరించారు.''సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు రెండు సీజన్లలో ఎక్కువగా రికార్డవుతుంటాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఒకసారి... అక్టోబరు, నవంబరు సీజన్లలో మరోసారి ఎక్కువగా ఉంటాయి'' అని బి.శివయ్య చెప్పారు.రుతుపవనాల తర్వాత శీతాకాలం వచ్చి సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గడానికి కొంత ఆలస్యం అవుతుందని వివరించారు.ఈ పరిస్థితులతో అల్పపీడన ద్రోణి ఏర్పడటానికి పరిస్థితులు సహకరిస్తాయి'' అని చెప్పారు.బంగాళాఖాతంలో ఏర్పడే తుపానులు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా తీరం దాటడాన్ని గమనిస్తుంటాం.ఆంధ్రప్రదేశ్‌కు 1053.07 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరం ఉండగా, ఒడిశాకు 574.71 కిలోమీటర్ల పొడవైన తీరం ఉంది.తీరం పొడవు, తీరంలోని పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ వద్ద తుపానులు ఎక్కువగా తీరం దాటుతుంటాయని చెప్పారు నాగరత్న.''మచిలీపట్నం, నరసాపురం, కాకినాడ వద్ద తీరంలో మలుపులు ఉంటాయి.గోదావరి, కృష్ణా నదులు కలిసే ప్రాంతాలున్నాయి.తీరంలో ఉండే మలుపులు, సముద్రంలో నదులు కలిసే ప్రాంతాలు కూడా తుపానులను ఆకర్షించడానికి కారణమవుతాయి'' అని వివరించారు.2026 అక్టోబరు.. అర్నబ్ అతి తీవ్ర తుపాను.. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపురం సమీపంలో తీరం దాటింది. ఏపీపై పెను ప్రభావం చూపించింది.2026 నవంబరు.. మురసు తీవ్ర తుపాను.. ఇది ఆంధ్రప్రదేశ్ తీరంలోని నెల్లూరు సమీపంలో తీరం దాటింది.2014 అక్టోబరు.. హుద్ హుద్ తీవ్ర తుపాను.. ఏపీలో విశాఖపట్నంపై విరుచుకుపడింది.ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రికార్డుల ప్రకారం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పెను విధ్వంసం సృష్టించింది.ఇవేకాకుండా, ఏపీ చరిత్రలో అత్యంత తీవ్రమైన తుపానుగా కోస్తా తీర ప్రాంతవాసులు చెప్పుకొనే దివిసీమ తుపాను లేదా దివిసీమ ఉప్పెన కూడా 1977 నవంబరులోనే వచ్చింది.ఈ తుపాను కారణంగా 24 లక్షల మంది ప్రభావితం అయ్యారు. పదివేల మందికిపైగా చనిపోయారని అంచనా.1996 కాకినాడలో వచ్చిన తుపాను కూడా నవంబరు నెలలో సంభవించింది.2012లో కోస్తా జిల్లాలను కుదిపివేసిన నీలం తుపాను కూడా నవంబరులోనే సంభవించింది.సముద్రంలో ఏర్పడే అల్పపీడన ద్రోణి బలపడితే వాయుగుండగా మారుతుంది. వాయుగుండం బలపడి తీవ్ర వాయుగుండం.. ఆ తర్వాత తుపానుగా మారుతుంది.తుపానులలో గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుందని భారత వాతావరణ శాఖ చెబుతుంది.ప్రభావాన్ని బట్టి తుపాను లేదా తీవ్ర తుపాను లేదా అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ వర్గీకరిస్తుంది. గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుంది.గంటకు 31 కిలోమీటర్ల కంటే తక్కువగా గాలుల వేగం ఉంటే అల్పపీడన ద్రోణిగా పరిగణిస్తారు.గంటకు 31-49 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే వాయుగుండం, 50-61 కిలోమీటర్ల వేగం ఉంటే తీవ్ర వాయుగుండంగా పిలుస్తారు.గంటకు 62-88 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తుపాను, 89-117 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తీవ్ర తుపాను, 118-167 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ చెబుతుంది.అదే 168-221 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అత్యంత తీవ్రమైన తుపాను, 222 కిలోమీటర్లకు పైబడి గాలులు వస్తే సూపర్ తుపానుగా చెబుతారు.

# ఎట్టకేలకు ఫలించిన ఎంపీ ధర్మపురి అర్వింద్ పోరాటం

- మాధవ్ నగర్ ఆర్ఓబీకి రూ.101.80 కోట్లతో సవరించిన పరిపాలనా అనుమతి
- సహకరించిన మంత్రులు భట్టి, కోమటిరెడ్డి లకు ధన్యవాదాలు తెలిపిన ఎంపీ అర్వింద్




(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర):నిజామాబాద్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మాధవ్ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిచ్‌పల్లి–నిజామాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ నంబర్ 193 వద్ద నాలుగు వరుసల ఆర్ఓబీ నిర్మాణానికి రూ.101.80 కోట్లతో సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ నవంబర్ 2, 2026న G.O.Rt.No.568 జారీ చేసింది. గతంలో రూ.93.12 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయాన్ని రూ.101.80 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా అదనపు నిధుల అనుమతులకు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి గత రెండేళ్లుగా అదనపు నిధుల మంజూరు, సవరించిన అంచనాలకు సంబంధించిన పరిపాలనా అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో నిర్మాణ పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత మంత్రులకు విజ్ఞప్తులు చేశారు. గతంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కూడా కలిసి అదనపు నిధుల అవసరాన్ని వివరించారు. వెంటనే స్పందించిన కోమటిరెడ్డి ఫైల్‌ని క్లియర్ చేసి ఆర్థిక శాఖకి పంపారు. ఆర్థిక శాఖలో రెండేళ్లుగా ఫైల్ క్లియర్ కాకపోవడంతో ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 27న మాధవ్ నగర్ ఆర్ఓబీ వద్ద ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఓబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ ఎంపీ స్వయంగా భిక్షాటన కార్యక్రమం చేపట్టి ప్రజలు, నాయకులు, వాహనదారుల నుంచి విరాళాలు సేకరించారు. ప్రజల సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధిగా తాను ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధమనే సందేశాన్ని ఈ వినూత్న నిరసన ద్వారా తెలియజేశారు. అనంతరం అక్టోబర్ 29న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి మాధవ్ నగర్ ఆర్ఓబీకి సంబంధించిన రూ.8.68 కోట్ల అదనపు నిధులకు ఆర్థిక, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఎంపీ తెలిపారు. అక్టోబర్ 31న నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో కూడా మాధవ్ నగర్, అర్సపల్లి ఆర్ఓబీ నిర్మాణాల పురోగతిని ఎంపీ సమీక్షించారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై అధికారులను ప్రశ్నిస్తూ, నిర్దేశిత మైలురాళ్ల ప్రకారం పనులు వేగవంతం చేసి రానున్న నాలుగైదు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ వరుస ప్రయత్నాలు, రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు, ప్రజా నిరసనల నేపథ్యంలో ఈనెల 2న ప్రభుత్వం సవరించిన పరిపాలనా అనుమతులు జారీ చేయడం సంతోషకరమైన పరిణామమని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. దీనికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎంపీ అర్వింద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతర కృషి....

మాధవ్ నగర్ ఆర్ఓబీ పూర్తయితే నిజామాబాద్ నగరంతో పాటు డిచ్‌పల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర వైద్య సేవల కోసం ప్రయాణించే వారికి ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎంపీ తెలిపారు. ప్రభుత్వం సవరించిన అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా ఆర్ఓబీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



- గుడుంబా, గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు - సీఐ కృష్ణ హెచ్చరిక
- సరైన పత్రాలు లేని 40 వాహనాలు సీజ్

(చెన్నూర్, సాక్షర):కోటపల్లి మండలం అలుగామ గ్రామంలో మంగళవారం ఉదయం పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు సంయుక్తంగా భారీ దాడులు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాలు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టారు.చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న దుర్గం స్వామి, దాగం రమేష్, దాగం గోపాల్ లపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద ఉన్న 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 2,000 లీటర్ల బెల్లం పానకాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేయవద్దు ...

ఈ సందర్భంగా సీఐ కృష్ణ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కొద్దిపాటి ఆదాయం కోసం గుడుంబా తయారు చేసి ఎన్నో కుటుంబాల జీవితాలను, పచ్చని కాపురాలను నాశనం చేయవద్దని హితవు పలికారు. గుడుంబా మహమ్మారి కారణంగా కుటుంబాల్లో అశాంతి నెలకొంటుందని, దీనిని తయారు చేసినా లేదా విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతకు గంజాయిపై ప్రత్యేక హెచ్చరిక...

యువత చెడు అలవాట్లకు బానిస కావద్దని, ముఖ్యంగా గంజాయి జోలికి అసలు వెళ్లొద్దని సీఐ కోరారు. సరదా కోసం గంజాయి సేవించి తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని స్పష్టం చేశారు. గంజాయిని విక్రయించినా లేదా సేవించినా ఎలాంటి ఉపేక్ష ఉండదని, కఠిన శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత పోలీసులకు సహకరించి, సమాచారం అందించాలని కోరారు.

కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్.. 40 వాహనాలు సీజ్..

ఈ దాడుల అనంతరం గ్రామంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన వాహన పత్రాలు లేని సుమారు 40 వాహనాలను అధికారులు సీజ్ చేశారు. కార్యక్రమంలో కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్, నిల్వాయి ఎస్ఐ నాగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ సాయి, పోలీస్ - ఎక్సైజ్ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# నిర్మల్ లో కాషాయ జెండాల హోరు

- బీజేపీ మహా పాదయాత్రకు పోటెత్తిన జనం



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర):నిర్మల్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహా పాదయాత్రకు బీజేపీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.కాషాయ జెండాలు రెపరెపలాడుతుండగా పట్టణంలోని ప్రధాన వీధులు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ మహా పాదయాత్ర నిర్వహించినట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్ చార్జి సునీల్ బన్సల్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర సహ ఇన్ చార్జులు అభయ్ పాటిల్, రేఖా శర్మ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజిరెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తో పాటు పలువురు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాసర ప్రతిష్టను దెబ్బతీయొద్దు.... అభివృద్ధికి సహకరించండి

- డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర ఆలయంతో పాటు ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) గౌరవ ప్రతిష్టలను దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు చేయడం సరికాదని నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్ అన్నారు.యూనివర్సిటీలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూపిస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. మంగళవారం బాసరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మారుమూల ప్రాంతమైన బాసర అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.అప్పట్లో తాను సర్పంచ్ గా, నారాయణరావు పటేల్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో యూనివర్సిటీ ఏర్పాటుకు ఎంతో కృషి చేశామని, భూసేకరణకు సహకరించడంతో పాటు అనేక ఇబ్బందులను ఎదుర్కొని సంస్థకు పునాది వేశామని తెలిపారు.సుమారు 9 వేల మంది విద్యార్థులు, 2 వేల మంది సిబ్బంది, వేలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ విద్యాసంస్థ గత పదేళ్ల పాలకుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొందని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ప్రస్తుతం యూనివర్సిటీ మళ్లీ అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జాదవ్ శీను పటేల్, అశోక్, గురప్ప, శంకర్, భోజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కు దూరంగా.. బీఆర్ఎస్ కు దగ్గరగా బీజేపీ



సాక్షర, హైదరాబాద్:మొత్తానికి కమలం పార్టీ అధిష్టానానికి తెలంగాణ గుర్తుకొచ్చింది. ఇక్కడ 8 మంది ఎంపీలు ఉన్నారనే విషయాన్ని ఇప్పుడు యాదికి తెచ్చుకుంది. ఇన్ని రోజులపాటు పార్టీని గాలికి వదిలేసిన అధిష్టానం.. మొత్తానికి ఏదో సీరియస్ ఎఫర్ట్ పెట్టినట్టుంది. ఇప్పటికే ఈటల రాజేందర్ సొంతంగా పాదయాత్ర చేస్తానని ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు మిగతా ఎంపీలు ఎవరి దారి వారు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కొంతకాల క్రితం ఈటల రాజేందర్.. బండి సంజయ్ మధ్య ఎలాంటి వ్యవహారాలు సాగాయో అందరికీ తెలుసు.అకస్మాత్తుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చారు. మహా పాదయాత్ర నిర్వహించారు. వాస్తవానికి ఆయన ప్రసంగంలో ఈసారి కాస్త వేరే కోణం కనిపించింది. ప్రారంభం నుంచి చివరి దాకా కాంగ్రెస్ పార్టీ మీద ఆయన మండిపడ్డారు. బహుశా ఇటీవల కాలంలో రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాల వల్ల కలిగిన ఇబ్బంది కావచ్చు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్ళతో పెకిలిస్తామని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోతే.. తదుపరి తెలంగాణ పీఠాన్ని బిజెపి అధిష్టిస్తుందా.. ఈ ప్రశ్నకు అవును అని అమిత్ షా సమాధానం చెప్పగలరా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.వాస్తవానికి అమిత్ షా చేపట్టిన మహా పాదయాత్ర ఉద్దేశం ఏమిటో తెలియదు గానీ.. ఇప్పటికే బీజేపీలో లుకలుకలు బయట పడుతున్నాయి. ఇటీవల పార్టీ తెలంగాణ ఇన్చార్జి ఓపెన్ గానే పార్టీలో ఉన్న పరిస్థితిని బయటపెట్టేశారు. నేతలు ఎవరికి వారు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని.. అసలు పార్టీ అభివృద్ధి కోసం పనిచేయడం లేదని.. పార్టీ కోసం పనిచేయని వ్యక్తులకు పదవులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అంతేకాదు అదే వేదిక మీద చాలామంది నాయకులను కడిగిపారేశారు. పార్టీ పరిస్థితి దారుణంగా ఉందని ఆయన అరిష్టానానికి నివేదిక ఇచ్చారు. బహుశా అందువల్లే అమిత్ షా ఇక్కడికి వచ్చి ఉంటారని తెలుస్తోంది. వాస్తవానికి 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణలో బిజెపికి మంచి ఊపు ఉండేది. పైగా.. బండి సంజయ్ నెత్తురుత్వంలో బిజెపి దూకుడు మీద ఉండేది. ఎప్పుడైతే బండి సంజయ్ ను పక్కనపెట్టి.. కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారో.. అప్పుడే పరిస్థితి మారిపోయింది. అధికారంలోకి వస్తుంది అనే ధీమా నుంచి.. పట్టుమని పది సీట్లు గెలుచుకోలేని దుస్థితికి బిజెపి పడిపోయింది..ఇక పార్లమెంటు ఎన్నికల్లో కాస్త పర్వాలేదు అనుకున్నప్పటికీ.. స్థానిక ఎన్నికల్లో సత్తా చూపించలేకపోయింది. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఏ మేరకు దూకుడు చూపిస్తుందో చూడాలి. గతంలో మాదిరిగా ఇప్పుడు ఆ పార్టీ నేతలు పని చేస్తారా.. అంతటి అవకాశం ఉందా.. ఈ ప్రశ్నలకు బిజెపి నాయకులే సమాధానం చెప్పాలి. అన్నట్టు గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమిత్ షా భీకరంగా వ్యాఖ్యలు చేశారు. కానీ కెసిఆర్ కుటుంబంలో ఒకరిని కూడా జైలుకు పంపించలేకపోయారు.. ఇప్పుడు కాంగ్రెస్ విషయంలో కూడా అమిత్ షా అదే స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. అంటే ఇప్పుడు కూడా అదే సీన్ రిపీట్ అవుతుందా.. అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.. కానీ అమిత్ షా మొత్తం ప్రసంగంలో గులాబీ పార్టీ ప్రస్తావన లేదు. అంటే ఆ పార్టీ అవినీతికి.. ఇతర దుర్మార్గాలకు అమిత్ షా క్లీన్ చీటీ ఇచ్చినట్టేనా.. అన్నట్టు కాళేశ్వరం.. ఇతర కేసుల్లో నిజాలు బయట పెట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆహ్వానిస్తున్నట్టు ఆ మధ్య రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసులను కూడా అప్పగించారు. మరింత వరకు ఒక అరెస్టు కూడా జరగలేదు.. మరి దీనిపై అమిత్ షా సమాధానం చెప్పలేదు. అసలు ఆ విషయాన్ని ప్రస్తావించలేదు.


# నైపుణ్యం నేర్చుకుంటే స్వయం ఉపాధి



- మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్
- జన శిక్షణ్ సంస్థ ఆధ్వర్యంలో దర్జీ అడ్వాన్స్ డ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

(అదిలాబాద్‌టౌన్, సాక్షర ):నైపుణ్యం నేర్చుకుంటే స్వయం ఉపాధి లభిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికవేత్తల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన శిక్షణ్ సంస్థ - అదిలాబాద్ ఆధ్వర్యంలో పట్టణంలో తాటిగూడలో దర్జీ అడ్వాన్స్ డ్ శిక్షణ కార్యక్రమానికి అదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని ఉత్సాహంగా ప్రారంభించి, శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జన శిక్షణ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ వర్క్, దర్జీ పనుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ శిక్షణ ద్వారా మహిళలు కుట్టుపనిలో మెళకువలు నేర్చుకొని, స్వయం ఉపాధి అవకాశాలను పొందడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి, తమ కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో జన శిక్షణ్ సంస్థ అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణలు ఎంతో అభినందనీయమని అన్నారు.కుట్టుపని వంటి వృత్తి నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా మహిళలు తమలోని ప్రతిభను వెలికితీసి, స్వయంగా ఉపాధి పొందే స్థాయికి ఎదగవచ్చని తెలిపారు.జన శిక్షణ్ సంస్థ ఆధ్వర్యంలో గతంలోనే 20 శిక్షణ బ్యాచ్ లు విజయవంతంగా పూర్తి చేయడం సంస్థ అందిస్తున్న శిక్షణల నాణ్యతకు, అభ్యర్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంలో సంస్థ చేస్తున్న కృషికి నిదర్శనమని అన్నారు.ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిరుద్యోగ యువతీ యువకులకు, ముఖ్యంగా మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న నైపుణ్యాలతో భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని అభ్యర్థులకు సూచించారు.నైపుణ్యాభివృద్ధి ద్వారా సమాజంలో ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇలాంటి కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని చైర్ పర్సన్ తెలిపారు.కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గంట జీవన్, జన శిక్షణ్ సంస్థ ప్రతినిధులు, శిక్షకులు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద ఉద్యమం చేపట్టనున్న ధనుష్..




సాక్షర, చెన్నై: కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గురించి ఇప్పుడు ఓ ఆసక్తికర విషయం ఫిల్మ్ వర్గాలతోపాటు సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తుంది. తన అభిమాన సంఘాన్ని ఇకపై స్వచ్ఛంద సంస్థగా మార్చనున్నట్లు ప్రచారం నడుస్తుంది. త్వరలోనే రాజకీయంలోకి అడుగుపెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే ఏవైనా న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి దాదాపు 3వేల మంది న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు తెలుస్తోంది.

తమిళనాడు రాజకీయాల గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. ఇటీవలే సొంతంగా పార్టీ ప్రారంభించి అఖండమైన మేజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు విజయ్ దళపతి. ఇప్పుడు ఆయన దారిలో మరో హీరో ధనుష్ సైతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హీరో త్వరలోనే రాజకీయ ప్రవేశం చేయనున్నారనే ప్రచారం తమిళనాడు సినీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటివరకు ఈ విషయం పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ నెట్టింట మాత్రం రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో న్యూస్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం ధనుష్ అభిమాన సంఘాన్ని స్వచ్ఛంద సంస్థగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది న్యాయసలహాదారులను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆన స్వచ్ఛంద సంస్థ 234 నియోజకవర్గాల కోసం ఏసీ సౌకర్యాలతో కూడిన ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతుందని ప్రచారం జరుగుతుంది.అభిమాన సంఘం ఒక స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, రాజకీయ మార్గంలో భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు సమాచారం. మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ వీరిని నియమిస్తే, ప్రతి నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని అంటున్నారు. భవిష్యత్తులో ధనుష్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులపై ఉన్న కేసులను పరిష్కరించడంలో, నిరసనల సమయంలో తలెత్తే చట్టపరమైన సమస్యలలో, స్థానిక సమస్యలలో వారు సహాయపడవచ్చని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇటీవల, ధనుష్ స్వచ్ఛంద సంస్థ వరుసగా అనేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, అక్టోబర్ 15, 2026న, ఫ్యాన్ క్లబ్‌ను స్వచ్ఛంద సంస్థగా మార్చి, ఒక జెండా , లోగోను ఆవిష్కరించారు.దీని తర్వాత, అక్టోబర్ 18, 2026న జరిగిన మహిళా బృంద నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న 3,000 మందికి పైగా మహిళా నిర్వాహకులకు ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి దీపాన్ని బహూకరించారు. దీని తర్వాత, జనవరి 2027 నుండి మొత్తం 234 నియోజకవర్గాలలో 10వ, ప్లస్ 2 విద్యార్థుల కోసం ఏసీ సౌకర్యాలతో ఉచిత ట్యూషన్ కేంద్రాలను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ప్రకటించారు. దీనిలో భాగంగా, ఆయన ఢిల్లీలోని ప్రముఖులను కలిశారని, కొత్త పార్టీకి పేరు నమోదు చేశారని వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిలో ఏదీ అధికారికంగా ధృవీకరించబడలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ముందు, తన అభిమాన సంఘాలను 'విజయ్ మక్కల్ ఉద్యమం'గా మార్చి ప్రతి జిల్లాలో సంక్షేమ సహాయం అందించారు. ఆ తర్వాత, ఆయన పార్టీని ప్రారంభించి, తాను పోటీ చేసిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. ధనుష్ కూడా అభిమాన సంఘాన్ని ఒక ఉద్యమంగా మార్చడం, నియోజకవర్గాల వారీగా నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం, ప్రజా సంక్షేమ పనుల్లో నిమగ్నమవడం వంటి అదే మార్గాన్ని అనుసరించడం ప్రారంభించారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తన రాజకీయ ప్రవేశంపై ధనుష్ ఇప్పటివరకు స్పందించలేదు.

# "మయూఖ" సినిమా 25 డేస్ గ్రాండ్ సక్సెస్ సెలబ్రేషన్స్

సాక్షర, హైదరాబాద్ : పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటించిన సినిమా "మయూఖ". ఈ చిత్రాన్ని ప్రశ్వీత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మించారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహించారు. ఇటీవలే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చిన "మయూఖ" సినిమా ట్రెండ్ సెట్టింగ్ థ్రిల్లర్ గా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఈ సినిమా 25 రోజుల సక్సెస్ సెలబ్రేషన్స్ ఈ రోజు హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ లీడర్ చిన్న శ్రీశైలం యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు మీడియా మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని "మయూఖ" సినిమా టీమ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డి.గిరీష్ రెడ్డి మాట్లాడుతూ - మా సినిమాకు ఉన్న బడ్జెట్ లో ఇంత క్వాలిటీగా సినిమా చేసి, గ్రాండ్ గా రిలీజ్ చేసుకున్నాం అంటే అందుకు మా డైరెక్టర్ విజన్ కారణం. ఆయనకు పెద్ద బడ్జెట్ ఇచ్చి సినిమా చేయమంటే మిరాకిల్స్ చేస్తారు. మా సినిమాను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. అన్నారు. యాక్టర్ రఘు వాసిరెడ్డి మాట్లాడుతూ - మా సినిమా సక్సెస్ షీల్డ్ అందుకోవడం నా కెరీర్ లో ఎంతో స్పెషల్ మూవ్ మెంట్ గా భావిస్తున్నా. ఈ షీల్డ్ నేను అందుకున్నానంటే కారణం మా డైరెక్టర్ శ్రీతేజ్. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. అన్నారు.

యాక్టర్ అభిలాష్ అడ్డ మాట్లాడుతూ - ఈ రోజున సినిమాలు ఒక వారం రోజులు ఆదరణ పొందితేనే గొప్ప విషయం. అలాంటిది మా సినిమాకు పాతిక రోజుల రన్ ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతున్నాం. చిన్న సినిమాల విషయంలో బాక్సాఫీస్ వద్ద ఇది అరుదుగా దక్కే విజయం. ఈ సినిమా సక్సెస్ మా డైరెక్టర్ విజన్, కన్విక్షన్ ను చూపిస్తోంది. అన్నారు. ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ- ఒక సినిమా రిలీజై నెక్ట్స్ ప్రైడే చూడటం అనేది అరుదు. అలాంటిది 25 రోజులు థియేటర్స్ లో సినిమా రన్ కావడం అంటే ఈజీ కాదు. అలాంటి ఘనత సాధించిన "మయూఖ" టీమ్ ను అభినందిస్తున్నా. ఈ రోజు చిన్న చిత్రాలు థియేటర్స్ లో ఆడటం ఎంత కష్టమైందో మనం చూస్తున్నాం. ఈ టీమ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.

వీ5 ఎండీ వెంకటేష్ మాట్లాడుతూ - "మయూఖ" సినిమా ప్రీమియర్స్ వేశారు. అప్పుడు సినిమా చూసి ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుందని చెప్పాను. మేము ఆశించినట్లే "మయూఖ" సినిమాను సూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. అన్నారు. యాక్టర్ దేవ్ డి మాట్లాడుతూ - మా సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ కు మైండ్ బెండింగ్ బ్లాక్ బస్టర్ అని పేరు పెట్టారు. ఇంతకంటే పెద్ద పేరు పెట్టినా మాకు సంతోషమే. కొత్త టీమ్ తో ఇలాంటి డిఫరెంట్ థ్రిల్లర్ నిర్మించిన మా డ్యూసర్ గారికి, సినిమాను రూపొందించిన మా డైరెక్టర్ గారికి థ్యాంక్స్. అన్నారు. హీరోయిన్ పాయల్ చెంగప్ప మాట్లాడుతూ - తెలుగులో నాకు ఇది ఫస్ట్ మూవీ. మా టీమ్ కూడా కొత్త వాళ్లే. ఇలాంటి కొత్త టీమ్ కు పెద్ద సక్సెస్ ఇచ్చిన ఆడియెన్స్ కు థ్యాంక్స్. ఈ రోజు మా సినిమా 25 రోజుల సక్సెస్ సెలబ్రేషన్స్ జరుపుకోవడం సంతోషంగా ఉంది. మా మూవీ రిలీజ్ కు ముందే న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ మిస్టరీ మూవీ అవార్డ్ గెల్చుకుంది. మా డైరెక్టర్ కు కూడా అవార్డ్స్ వచ్చాయి. నాకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన మా ప్రొడ్యూసర్, డైరెక్టర్ గారికి థ్యాంక్స్. మీ అందరి సపోర్ట్ వల్లే మేము ఈ విజయాన్ని అందుకోగలిగాం. మీ ఆదరణ ఇలాగే మాకు ఉంటుందని ఆశిస్తున్నాం. అన్నారు. ప్రొడ్యూసర్ శశిధర్ నల్ల మాట్లాడుతూ - థియేటర్స్ దగ్గర పెద్ద సినిమాలు, భారీ బడ్జెట్ మూవీస్ నిలబడని పరిస్థితి చూస్తున్నాం. అలాంటి పరిస్థితుల్లో మా సినిమా థియేట్రికల్ గా 25 రోజుల సక్సెస్ ఫుల్ గా ప్రదర్శితమవుతుండటం సంతోషంగా ఉంది. మా టీమ్ అందరికీ ఈ విజయం గర్వకారణం. మాది కంటెంట్ ఉన్న సినిమా, తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుందని నేను ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చెప్పాను. నా మాటను ఆడియెన్స్ నిజం చేశారు. మంచి స్క్రిప్ట్, ప్లానింగ్, కష్టపడే టీమ్ ఉంటే మయూఖ లాంటి విజయం ఏ ప్రొడ్యూసర్ అయినా సాధించవచ్చు. అన్నారు. డైరెక్టర్ శ్రీతేజ్ ఎస్. కె . మాట్లాడుతూ - నేను హనుమాన్ మాలలో ఉండే ఈ సినిమా ప్రమోషన్స్ చేశాను. ఆయన శక్తే మా సినిమాను ముందుకు నడిపించిందని నమ్ముతున్నాను. మేము ఏదో రన్ చేస్తున్నామని ఈ సినిమాను థియేటర్స్ లో రన్ చేయడం లేదు. నిన్న 25 డే మా టీమ్ థియేటర్స్ కు వెళ్లారు. దాదాపు 50 పర్సెంట్ ఆక్యుపెన్సీ ఉంది. మా మూవీని ప్రేక్షకులు జెన్యూన్ గా ఆదరిస్తున్నారు. ఆడియెన్స్ థియేటర్స్ కు రావడం చూసి నేను ఎమోషనల్ గా సోషల్ మీడియాలో పోస్ట్ కూడా చేశాను. మాది చిన్న సినిమా అని మొదట్లో ఎవరూ పట్టించుకోలేదు. కానీ అభిరుచి గల ఆడియెన్స్ సక్సెస్ చేశారు. నేను స్టోరీ చెప్పినప్పుడు మా ప్రొడ్యూసర్ శశిధర్ గారు బడ్జెట్ ఏంటి, తీయగలడా లేదా అని ఆలోచించలేదు ఓకే మూవీ చేస్తున్నాం అన్నారు. ఆయన నమ్మకాన్ని నేను నిలబెట్టానని నమ్ముతున్నా. అలాగే మా హీరోయిన్ పాయల్ కూడా కథ చెప్పగానే నమ్మి చేశారు. ఈ సక్సెస్ కు కారణమైన మా టీమ్, మీడియా మిత్రులు అందరికీ నా థ్యాంక్స్. అన్నారు. పొలిటికల్ లీడర్ చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ - కంటెంట్ బాగున్న చిన్న సినిమాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూ వస్తున్నారు. మేము ఎన్నో ఏళ్లుగా చిన్న సినిమాలకు సపోర్ట్ గా నిలుస్తున్నాము. మయూఖ సినిమా 25 రోజుల వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. డైరెక్టర్ శ్రీతేజ్, ప్రొడ్యూసర్ శశిధర్ నాకు చాలాకాలంగా తెలుసు. మీ టీమ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలి. మీ టీమ్ కు ఏ సహాయం కావాలన్నా నా దగ్గరకు రావొచ్చు. చిన్న చిత్రాలకు ప్రభుత్వం తరుపున కూడా సపోర్ట్ అందేలా చేస్తాం. అన్నారు. పొలిటికల్ లీడర్ చిన్న శ్రీశైలం యాదవ్, వీ5 ఎండీ వెంకటేష్, ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల "మయూఖ" టీమ్ కు సక్సెస్ షీల్డ్ లు అందించారు. నటీనటులు - పాయల్ చెంగప్ప, బిగ్ బాస్ ఫేమ్ అమన్ మసూద్, దేవ్ డి, మురళీధర్ గౌడ్, లావణ్య రాణి, చరిశ్మ దబ్బార, జాను వర్మ, నానాజీ కర్రి, రఘు వాసిరెడ్డి, అభిలాష్ అడ్డ, వి.ఎస్. రాజు, మది నస్రీన్, బేబి మాన్వీ, మాస్టర్ షణ్ముఖ చరణ్, శశి కదిరి, రాంబాబు రామిశెట్టి, పవన్ లక్కిరెడ్డి, మణిసాయి, సత్య విఠల్, ప్రశ్వీత చౌదరి నల్లా, వేగి నాయుడు, శ్రీధర్, మణికంఠ




# లాభాల్లో ఎస్ బీఐ దూకుడు




సాక్షర,ముంబై: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు నమోదు చేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14.3 శాతం పెరిగి రూ.23,038 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు రూ.20,160 కోట్ల లాభాన్ని ఆర్జించింది. వడ్డీ ఆదాయంలో వృద్ధి, రుణ నష్టాల కోసం కేటాయింపులు తగ్గడం లాభం పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 15 శాతం పెరిగి రూ.49,143 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో ఇది రూ.42,847 కోట్లుగా ఉంది. రుణాలపై వచ్చిన వడ్డీకి, డిపాజిట్లపై చెల్లించిన వడ్డీకి మధ్య ఉన్న తేడానే నికర వడ్డీ ఆదాయం. మరోవైపు, నిర్వహణ లాభం మాత్రం 1.4 శాతం తగ్గి రూ.26,937 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.27,311 కోట్లుగా నమోదైంది. ఈసారి రూ.7,288 కోట్ల మేర ఒకేసారి వచ్చిన ఆదాయం కూడా బ్యాంకు లాభానికి అదనపు ఊతమిచ్చింది.రుణాల నాణ్యతలోనూ ఎస్‌బీఐ మెరుగుదల సాధించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.39 శాతానికి తగ్గింది. జూన్ త్రైమాసికంలో ఇది 1.47 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తుల (ఎన్ఎన్‌పీఏ) నిష్పత్తి కూడా 0.38 శాతం నుంచి 0.36 శాతానికి దిగివచ్చింది. రుణ నష్టాల కోసం చేసిన కేటాయింపులు గత ఏడాది ఇదే కాలంలోని రూ.5,400 కోట్ల నుంచి రూ.4,217 కోట్లకు తగ్గాయి.

# మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు ఏఐతో చెక్

- మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు



సాక్షర, హైదరాబాద్: మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పంటల కొనుగోళ్లు, విక్రయాల్లో పారదర్శకత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ ఆధారిత డిజిటల్ వ్యవస్థను రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి లావాదేవీ పారదర్శకంగా జరిగేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం ఐటీ శాఖ సమన్వయంతో వారం రోజుల్లోగా టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టం చేశారు.సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ యార్డుల ఆధునికీకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డుకు రైతు వచ్చినప్పటి నుంచి పంట విక్రయ ప్రక్రియ పూర్తయ్యే వరకు జరిగే ప్రతి దశను ఒకే డిజిటల్ వేదికపై నమోదు చేయాలని ఆదేశించారు. యార్డుకు వచ్చిన రైతుల వివరాలు, వారు తీసుకొచ్చిన పంట పరిమాణం, నాణ్యత, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్ల కార్యకలాపాలు, వేలం ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా వ్యవస్థను రూపొందించాలన్నారు. డిజిటల్ విధానం ద్వారా మార్కెట్ యార్డుల్లో జరిగే లావాదేవీలను పర్యవేక్షించడంతో పాటు అక్రమాలు, అవకతవకలకు అవకాశాలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంటల తూకం, ధర నిర్ణయం, వేలం, విక్రయాలకు సంబంధించిన వివరాలు ఒకే వేదికపై నమోదైతే రైతులకు మరింత స్పష్టత లభించే అవకాశం ఉంటుంది. ఏ దశలోనూ సమాచారం దాచిపెట్టకుండా, సంబంధిత వివరాలను అధికారులు పర్యవేక్షించేలా సాంకేతిక వ్యవస్థను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ అమల్లోకి వస్తే రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ల నిర్వహణలో సాంకేతిక మార్పులకు మార్గం సుగమం కానుంది.మరోవైపు హైదరాబాద్ శివార్లలో నిర్మిస్తున్న కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ పనుల పురోగతిపైనా సమావేశంలో చర్చించారు. నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై తుమ్మల అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పండ్ల రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, పంటల విక్రయాల్లో మధ్యవర్తుల ప్రభావాన్ని తగ్గించడం, మార్కెట్ మౌలిక వసతులను ఆధునికీకరించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది.

# దీపావళి వెలుగుల్లోనైనా పదవుల గ్రహణం వీడేనా?

ఇటీవల సీఈసీ వ్యవహారంపై రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రవాణా పరమైన సవాళ్లు ఎదురైనా శ్రేణులను ఢిల్లీకి సమీకరించడంలో నాయకత్వం చూపిన చొరవ పార్టీ సంస్థాగత శక్తిని మరోసారి చర్చకు తెచ్చింది. ఈ కార్యక్రమంతో శ్రేణుల్లో ఉత్సాహం కనిపించినా, నామినేటెడ్ పదవుల విషయంలో మాత్రం నిరీక్షణ కొనసాగుతోంది. సంక్రాంతి, ఉగాది, దసరా గడిచాయి. ఇప్పుడు దీపావళి వచ్చింది. పండుగలు మారుతున్నా పదవులపై ఆశావహుల ఎదురుచూపులు మాత్రం ముగియడం లేదు. ప్రతి పండుగకు ముందు ప్రకటనపై ఆశలు పెరిగి, చివరకు స్పష్టత రాకపోవడం వెనుక రాజకీయ లెక్కలేమిటి? పేర్లు ఖరారయ్యాయా? అధిష్ఠానం ఆమోదం కోసమే జాప్యమా? లేక సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయా? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదు. అక్టోబర్ 10న వెలువడిన సమాచారం ప్రకారం, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల ఎంపిక పూర్తిచేసి పేర్లను అధిష్ఠానానికి పంపినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన రావచ్చన్న సంకేతంతో పార్టీ శ్రేణుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రభుత్వ నామినేటెడ్ పదవులతోపాటు పార్టీ సంస్థాగత నియామకాలపైనా నిర్ణయాలు వెలువడాల్సి ఉండటంతో నాయకత్వం తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది.

నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ.. అసలు లెక్క ఎప్పుడు తేలుతుంది?

కార్పొరేషన్లు, సహకార సంస్థలు, మార్కెట్ కమిటీలు, సంక్షేమ సంస్థల్లో చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల నియామకాల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 22న వెలువడిన నివేదిక ప్రకారం, సుమారు 50 కొత్త నియామకాలతోపాటు పదవీకాలం ముగిసిన మరో 30కి పైగా స్థానాలు కలిపి దాదాపు 80 పోస్టుల భర్తీపై కసరత్తు జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో ప్రచారంలోకి వచ్చిన 87 పోస్టుల అంచనాతో ఈ సంఖ్య సరిపోకపోవడంతో అసలు ఖాళీలపై స్పష్టత అవసరమైంది. ఆర్టీసీ, పౌర సరఫరాలు, మూసీ రివర్‌ఫ్రంట్, పారిశ్రామికాభివృద్ధి, పర్యాటకం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు చెందిన సంస్థల్లో నియామకాలపై ఆసక్తి నెలకొంది. పదవీకాలం ముగిసిన సుమారు 37 మంది కార్పొరేషన్ చైర్మన్ల స్థానాల భర్తీపైనా నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. అయితే ఈ సంఖ్యలను అధికారికంగా ప్రకటించిన తుది ఖాళీలుగా భావించరాదు. కొందరు గతంలో నిర్వహించిన పదవులను కొనసాగించాలని ఆశిస్తుండగా, మరికొందరు తొలిసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 14న దసరా నాటికి నియామకాలు చేపట్టే అవకాశంపై సంకేతాలు వెలువడగా, అక్టోబర్ 18న వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని, దసరాకు ముందే ప్రకటన ఉండకపోవచ్చని నాయకత్వం తెలిపినట్లు నివేదికలు పేర్కొన్నాయి. గడువుపై భిన్నమైన సంకేతాలు రావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రచారంలో ఉన్న అంచనాల కంటే ఖాళీల వివరాలు, ఎంపిక ప్రమాణాలు, నియామకాల గడువును వెల్లడించడం ముఖ్యం.

పాత అనుభవం.. కొత్త రాజకీయ బలం.. సమతుల్యత ఎలా...?

పదవుల పంపిణీ కాంగ్రెస్ నాయకత్వానికి కీలక పరీక్షగా మారింది. ప్రతిపక్షంలో పదేళ్లపాటు పార్టీ కోసం పనిచేసిన నాయకులు, ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో శ్రమించిన కార్యకర్తలు తమ సేవలకు గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు కూడా తమ రాజకీయ అనుభవం, ప్రజాబలం ఆధారంగా బాధ్యతలు కోరుతున్నారు. దీర్ఘకాలంగా పార్టీకి అండగా నిలిచినవారికి ప్రాధాన్యమిస్తూనే కొత్తగా చేరినవారికి అవకాశాలు కల్పించడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం నాయకత్వం ముందున్న సవాలు. ఆగస్టు 23న నిజామాబాద్‌లో పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసినవారికి 70 శాతం నామినేటెడ్ పదవులు కేటాయిస్తామని, కొత్తగా వచ్చినవారికీ ప్రాతినిధ్యం ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఆగస్టు 24న కూడా పార్టీ కోసం నిరంతరం శ్రమించినవారికి ప్రాధాన్యం ఇవ్వాలని, గత మూడేళ్లలో అందరికీ తగిన అవకాశాలు లభించలేదన్న అసంతృప్తిని ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. ప్రకటనల్లో వ్యక్తమైన ప్రాధాన్యం ఎంపికల్లోనూ ప్రతిబింబించాలి. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతోపాటు జిల్లా, నియోజకవర్గ కమిటీల నియామకాలు పూర్తికాకపోవడం పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం ఎదురుచూస్తున్న కొందరు నేతలు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులపైనా ఆశలు పెట్టుకున్నట్లు నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. ఒకే బాధ్యత కోసం పలువురు పోటీపడుతున్న వేళ పార్టీ సేవలు, రాజకీయ అనుభవం, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యతకు ఏ ప్రాతిపదికన ప్రాధాన్యం ఇస్తారన్నది కీలకం.

కేడర్ ఆశలకు వెలుగునివ్వడం నాయకత్వ బాధ్యత!

నామినేటెడ్ పదవులు కేవలం హోదాలు కావు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం పెంచడం, ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావడం వంటి బాధ్యతలు వాటితో ముడిపడి ఉంటాయి. నియామకాల జాప్యం కొనసాగితే ఆశావహుల నిరీక్షణతోపాటు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల ఉత్సాహంపైనా ప్రభావం పడవచ్చు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పీసీసీ కార్యవర్గ విస్తరణ, జిల్లా–నియోజకవర్గ కమిటీల ఏర్పాటు, కార్పొరేషన్ పదవుల భర్తీని సమన్వయంతో పూర్తిచేస్తే శ్రేణులకు స్పష్టమైన సందేశం అందుతుంది. అర్హత, పార్టీ సేవలు, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యత ఆధారంగా ఎంపికలు చేపట్టి నిర్దిష్ట గడువును ప్రకటించాలి. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన వస్తుందన్న సంకేతాలు

## జవహర్ నవోదయ క్యాంపస్ కు అన్ని వసతులు కల్పించాలి

- ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర):గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ విద్యా సంస్థను విద్యార్థులతో పాటు అధ్యాపకులు, సిబ్బందికి తగిన వసతి, బోధనా తరగతుల నిర్వహణ వంటి వాటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.నిజామాబాద్ జిల్లా జాక్రాన్ పల్లి మండలం కలిగోట్ లో నూతనంగా నెలకొల్పుతున్న జవహర్ నవోదయ విద్యాలయ కొత్త క్యాంపస్ భవన నిర్మాణ ప్రదేశాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. జేవీఎన్ నిర్వహణకు అనువైన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వసతులను నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పనులను నాణ్యతతో వేగంగా జరిపించాలని, విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పనులు చేపట్టే సందర్భంగా ఏవైనా ఆటంకాలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. అటవీ శాఖతో పాటు ఇతర అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని, ఎలాంటి సమస్యలు లేవని సంబంధిత అధికారులు తెలిపారు.గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ విద్యా సంస్థను ఏర్పాటు చేస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నిర్దేశిత గడువు లోపు పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.తరగతి గదులు, డార్మెటరీ, డైనింగ్ హాల్, లైబ్రరీ, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు, స్టాఫ్ క్వార్టర్స్ కోసం నిర్మించనున్న భవన సదుపాయాల బ్లూప్రింట్ ను పరిశీలించారు.నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, మొరం నిల్వలకు నిబంధనల మేరకు వెంటవెంటనే అనుమతులు మంజూరు చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ నీటి వసతి, రోడ్డు, విద్యుత్ వంటి అన్ని వసతులు సకాలంలో అందుబాటులోకి రావాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఉండేలా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.కనీసం రెండు మూడు వారాలకు ఒక పర్యాయం అయినా క్షేత్రస్థాయి సందర్శన జరుపుతూ, నిర్మాణ పనుల ప్రగతి గురించి తనకు నివేదించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియకు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు

## ఎల్ నినో పై అవగాహన కల్పించిన విద్యార్థులు

- అభినందించిన చైర్ పర్సన్ అనూష



(అదిలాబాద్, సాక్షర):అదిలాబాద్ పట్టణంలో ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చిన ది మాస్టర్ మైండ్స్ స్కూల్ - 2 విద్యార్థులను మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొని విద్యార్థులు చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు.ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటు చేసుకునే మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతం తగ్గుదల, కరువు పరిస్థితులు, వ్యవసాయంపై పడే ప్రభావం తదితర అంశాలను వివరిస్తూ విద్యార్థులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనడం ఎంతో సంతోషకరమని అన్నారు.ఎల్ నినో వంటి వాతావరణ పరిణామాల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు.ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, విద్యుత్ ను ఆదా చేయాలని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడం, ప్రకృతిని కాపాడటం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.విద్యార్థులు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో సామాజిక బాధ్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న సమస్యలపై అవగాహన పెంచుకొని, ప్రజలకు మంచి సందేశాన్ని అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.ఇలాంటి సామాజిక అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ది మాస్టర్ మైండ్స్ స్కూల్ - 2 యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గంట జీవన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్టీల పేరుతో మోసం

సాక్షర,మెదక్: సిద్దిపేట జిల్లాలో నమ్మకమే పెట్టుబడిగా సాగిన చిట్టీల వ్యాపారం తీవ్ర విషాదాన్ని, వివాదాన్ని మిగిల్చింది. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు కూడబెట్టుకున్న సుమారు రూ.1.50 కోట్ల సొమ్మును ఓ వ్యాపారి టోకరా వేసిన ఘటన చేర్యాల పట్టణ శివారులోని బీడీ కాలనీలో వెలుగులోకి వచ్చింది. బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించాల్సింది పోయి, ఏకంగా కోర్టు ద్వారా వారికే ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (IP) నోటీసులు పంపించడంతో బాధితులు తీవ్ర ఆగ్రహంతో ఆందోళనకు దిగారు.నమ్మకమే పెట్టుబడిగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ సుమారు 1.50 కోట్ల మేర టోకరా వేసిన ఘటన సిద్దిపేట జిల్లాలో వెలుగులోకి వచ్చింది..దీనికి తోడు చిట్టీలు కట్టి మోసపోయిన బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించాల్సింది పోయి..ఆ నిర్వాహకుడు కోర్టు ద్వారా బాధితులకే ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) నోటీసులు పంపడం వివాదాస్పదంగా మారింది.దీంతో తమ కష్టార్జితం కోల్పోయిన బాధితులు ఆదివారం నిర్వాహకుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు.పూర్తి వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ శివారులోని బీడీ కాలనీ కేంద్రంగా మహ్మద్ అజీజ్ అహ్మద్ కొంతకాలంగా అనధికారికంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ప్రారంభంలో లావాదేవీలు సజావుగా సాగడంతో కాలనీవాసులు అతడిని నమ్మి పెద్ద సంఖ్యలో చిట్టీలు వేశారు. ఆడపిల్లల పెళ్లిళ్లు, ఇళ్ల నిర్మాణాలు, కుటుంబ అవసరాల కోసం పైసాపైసా కూడబెట్టుకున్న డబ్బులను చిట్టీల్లో పెట్టుబడిగా పెట్టారు. అయితే కొంతకాలం తర్వాత చిట్టీలు ఎత్తుకున్న వారికి డబ్బులు చెల్లించకుండా నిర్వాహకుడు జాప్యం చేయడం మొదలుపెట్టాడు..ఇతర సభ్యులు వాయిదాలు చెల్లించడం లేదంటూ సాకులు చెబుతూ కాలయాపన చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.బాధితులకే ఐపీ నోటీసులు..తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ బాధితులు ఒత్తిడి పెంచడంతో నిర్వాహకుడు అజీజ్ అహ్మద్ కోర్టును ఆశ్రయించాడు...తాను ఆర్థికంగా నష్టపోయానని, అప్పులు తీర్చే స్థోమత లేదని పేర్కొంటూ ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ దాఖలు చేశాడు. దీంతో బాధితులకు కోర్టు నుంచి ఐపీ నోటీసులు అందాయి. తాము చిట్టీల రూపంలో డబ్బులు చెల్లించినప్పటికీ, తమను అప్పుదారులుగా చిత్రీకరిస్తూ నోటీసులు పంపించారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈ చిట్టీలు వేసిన వారిలో చాలా మంది పెడవాళ్లే ఉన్నారు..ఎక్కువగా వితంతువులు, దినసరి కూలీలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు బాధితులు తమ జీవితకాల పొదుపును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు..కోర్టు నోటీసులతో తమకు సంబంధం లేదని, తాము చెల్లించిన ప్రతి పైసా తిరిగి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు...డబ్బులు చెల్లించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.అనంతరం ఈ వ్యవహారంపై జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు బాధితులంతా కలిసి సీపీ కార్యాలయానికి తరలివెళ్లారు.తమకు న్యాయం చేసి, చిట్టీల పేరుతో జరిగిన మోసంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు.

## డాక్టర్ డూమ్ హవా - 'అవెంజర్స్

- డూమ్స్‌డే' నుంచి 5 కొత్త పోస్టర్లు విడుదల

మార్వెల్ స్టూడియోస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'అవెంజర్స్: డూమ్స్‌డే' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమా నుంచి 5 కొత్త పోస్టర్లను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పోస్టర్లలో మార్వెల్ సినీ విశ్వంలోని అత్యంత శక్తివంతమైన ప్రతినాయకుల్లో ఒకరైన డాక్టర్ డూమ్‌ను ప్రధానంగా చూపించారు. భారీ తారాగణం, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. మార్వెల్ సినిమాల అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది అతిపెద్ద సినీ వేడుకల్లో ఒకటిగా నిలవనుంది. ఈ చిత్రం 2026 డిసెంబర్ 17న భారతదేశంలోని థియేటర్లలో విడుదల కానుంది. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 4DX, RealD 3D, ScreenX, Dolby, మార్వెల్ స్టూడియోస్ అందిస్తున్న ఇన్ఫినిటీ విజన్ వంటి ప్రీమియం ఫార్మాట్లలోనూ ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ప్రీమియం ఫార్మాట్లులో విడుదల కానుంది.

## చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ లో జరిగిన విరాట్ కొహ్లీ బర్త్ డే వేడుకలు



సాక్షర, హైదరాబాద్ : చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ లో ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కొహ్లీ బర్త్ డే వేడుకలు జరిగాయి. విరాట్ కొహ్లీ అభిమానులు నిర్వహించిన ఈ వేడుకల్లో కట్ట ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నవంబర్ 5న విరాట్ కొహ్లీ పుట్టినరోజు సందర్భంగా కొహ్లీ అభిమానులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయడంతో పాటు బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కొహ్లీ ఫ్యాన్స్ తమ ఫేవరేట్ క్రికెటర్ పై ఉన్న అభిమానాన్ని మంచి సామాజిక కార్యక్రమానికి ఉపయోగించడం ప్రశంసనీయం.

## కమలానికి దగ్గరవుతున్న చిరంజీవి

సాక్షర, హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో అందరి వాడు. పరిశ్రమకు పెద్ద దిక్కు. ఆయన పెద్దరికం మీద అందరికీ నమ్మకం ఉంది. అనేక సమస్యలను ఆయన పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇక చిరంజీవి స్వభావానికి రాజకీయాలు పడవని సన్నిహితులు అంటారు. ఆయన మెత్తని స్వభావం కలిగిన వారు. అందుకే ఆయన రాజకీయాల్లోకి ఎంత తొందరగా వెళ్లాలో అంతే వేగంగా వెనక్కి తిరిగారు. అది కూడా ఎలాంటి విమర్శలు పెద్దగా లేకుండానే గౌరవంగా తప్పుకున్నారు. ఇక తన జీవితం అంతా సినిమాలకే అంకితం అని ఆయన పదే పదే అనేక సార్లు చెప్పి ఉన్నారు. అయినా సరే మెగాస్టార్ చుట్టూ ఎపుడూ రాజకీయ ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆయన విషయంలో మరోసారి అలాంటి వార్తలే ప్రచారంలో ఉంటూ వస్తున్నాయి. అమిత్ షాతో భేటీ : ఇదిలా ఉంటే హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి బీజేపీ అగ్ర నేత అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి ఆయన కుమారుడు రామ్ చరణ్ తో పాటుగా వెళ్ళి కలిశారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నా కూడా చిరంజీవి రాజకీయం గురించి మరోసారి చర్చించే విధంగా వార్తా కధనాలు అల్లుతున్న వారూ ఉన్నారు. అయితే అమిత్ షాను కలిసిన ప్రముఖులలో అనేక రంగాలకు చెందిన వారు ఉన్నారు. అందులో మై హోం నుంచి రామేశ్వరరావు, అలాగే ఒక ప్రముఖ తెలుగు టీవీ చానెల్ అధినేత ఇంకా అనేక మంది ఉన్నారు. అయితే అందరి దృష్టి మాత్రం మెగాస్టార్ మీదనే ఉంది. ఎందుకంటే ఆయన సినీ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి, అంతే కాదు జనసేన అధినేత పవన్ కి సోదరుడు కాబట్టి అని అంటున్నారు. ఇక పవన్ ఏపీలో కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా ఉన్నారు. ఆ కూటమిలో బీజేపీ కూడా ఉంది. అలా ఆ బంధాన్ని కూడా కలుపుతూ చిరంజీవి రాజకీయాల మీద చర్చించే వారూ ఉన్నారు. అయితే అమిత్ షాని చిరంజీవి కలవడం వెనక రాజకీయం లేదని అంటున్నారు. కేవలం మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్ సినీ రంగం పరిస్థితులలో పాటు తమ సినిమాల గురించి చర్చకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇక చిరంజీవి విషయానికి వస్తే ఆయన రాజకీయంగా అందరి వాడుగా ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఆయనకు పార్టీలతో సంబంధం లేదని కూడా అంటున్నారు. ఏపీలో ఈ మధ్య పర్యటించిన మెగాస్టార్ కూటమి ప్రభుత్వం పాలన బాగుందని చెప్పారని అంటున్నారు. అలాగే రేవంత్ రెడ్డితో కూడా అనేక వేదికలు పంచుకున్నారని అంటున్నారు. ఇలా అందరి వాడుగా ఉంటూ వస్తున్న చిరంజీవి రాజకీయాలలో క్రియాశీలకం అవుతారు అన్నది కేవలం ఊహాగానాలే అని అంటున్నారు.అయితే కమలం పార్టీకి ఆశలు మాత్రం ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ కూటమిలో ఉన్నారు. చిరంజీవి వంటి బిగ్ ఫిగర్ కనుక తమతో ఉంటే తెలంగాణాలో కూడా అధికారానికి మరింత సులువు అవుతుందన్న లెక్కలు బీజేపీకి ఉన్నాయని చెబుతున్నారు. అయితే చిరంజీవి తిరిగి రాజకీయాల్లోకి వస్తారా అంటే అది ఈజీ కాదు కదా అసలు కుదిరే వ్యవహారం కానే కాదని అంటున్నారు. ఒక విధంగా చిరంజీవి రాజకీయం అన్నది ముగిసిన అధ్యాయం అని కూడా అంటున్నారు. అయితే కాలం ఎపుడూ గొప్పది చూడాలి మరి ఊహాగానాలు అలాగే ఉంటాయా లేక ఏమవుతాయి అన్నది.

## టీటీడీకి కొత్త కమిటీ..

- ముగ్గురు ఉన్నతాధికారులతో 'స్పెసిఫైడ్ అథారిటీ' ఏర్పాటు



సాక్షర,తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పదవీ కాలం ఇటీవల ముగియడంతో టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేయడం జరిగింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉంటారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి రెండేళ్ల పదవీ కాలం ఇటీవల ముగిసింది. తిరుమల చరిత్రలో ఇలాంటి స్పెసిఫైడ్ అథారిటీలు ఏర్పాటు కావడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలోనూ పాలకమండలి పదవీకాలం ముగిసి కొత్త బోర్డు ఏర్పాటులో న్యాయపరమైన, సాంకేతిక అడ్డంకులు ఎదురైన సందర్భాల్లో ప్రభుత్వాలు అధికారులతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను నడిపిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఈసారి ఎన్నికల నియమావళి అడ్డంకిగా మారడం, రాజకీయ నియామకాలకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించని కారణంగా .. ప్రభుత్వానికి స్పెసిఫైడ్ అథారిటీని తెరపైకి తేవడం అనివార్యమైంది. అనుభవజ్ఞులైన ఉన్నతాధికారులకే పాలనా పగ్గాలు అప్పగించడం ద్వారా రాజకీయ వివాదాలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా వ్యవస్థను నడిపించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం, కోడ్ ముగిసిన తర్వాతే పూర్తిస్థాయి టీటీడీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉంది. అప్పటివరకు తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించడం, రాబోయే రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయడం, నిధుల వినియోగంలో పారదర్శకతను కాపాడటం ఈ స్పెసిఫైడ్ అథారిటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి. సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో టీటీడీ సమర్థవంతంగా పనిచేస్తూ భక్తుల విశ్వాసానికి తగినట్లుగా నిర్ణయాలు తీసుకుంటుందని దేవదాయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేసింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉండనున్నారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.ఆయనతో పాటు అనుభవజ్ఞులైన మరో ఇద్దరి అధికారులు ఈ కమిటీలో ఉంటారు. ఈ ముగ్గురి టీమ్ శ్రీవారి ఆలయ నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, బోర్డు వ్యవహారాలను పర్యవేక్షించడం జరుగుతుంది. కొత్త టీటీడీ ట్రస్ట్ బోర్డును పునర్వ్యవస్థీకరించే వరకు లేదా ఏడాది కాల పరిమితి పూర్తయ్యే వరకు ఈ స్పెసిఫైడ్ అథారిటీ అమల్లో ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. అలాగే సాధారణ టీటీడీ పాలకమండలికి ఉండే చట్టబద్ధమైన అన్ని అధికారాలు, విధివిధానాలు, నిర్ణయాధికారాలు ఈ కమిటీకి వర్తిస్తాయి. దీనివల్ల కొత్త బోర్డు ఏర్పాటులో జాప్య

# నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకం

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి
- గ్రామ ప్రజల చొరవ అభినందనీయం
- ఏంద గ్రామంలో, లింగోజి తాండ ఉట్నూర్ ఎక్స్ రోడ్డు లో 15 సీసీటీవీ కెమెరాల ప్రారంభం



(ఉట్నూర్, సాక్షర):నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఏంద గ్రామంలో,లింగోజి తాండ ఉట్నూర్ ఎక్స్ రోడ్ నందు గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన 15 సీసీటీవీ కెమెరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రారంభించారు., (ఏందా గ్రామంలో 9, లింగోజి తాండ ఎక్స్ రోడ్డు లో ఆరు సీసీటీవీ కెమెరాలు) ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణలో సీసీటీవీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. గ్రామ ప్రజలు ఉన్నతంగా ఆలోచించి గ్రామ భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రత్యేకంగా ప్రశంసించారు.పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... చదువు అనే ఆయుధంతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, విద్య ఒక్కటే ఉజ్వల భవిష్యత్తుకు మార్గమని తెలిపారు. ప్రతిరోజూ కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ప్రతి విద్యార్థికి ఒక హాబీ ఉండాలని, హాబీల ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెరుగుతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు శారీరక వ్యాయామం, ఆటల్లో కూడా విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రిత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఏందా గ్రామ సర్పంచ్ కిరణ్ కుమార్ రాథోడ్, లింగోజి తాండ సర్పంచ్ మాయ హరినాయక్, పాఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి సోలార్ పంపుసెట్లు..

- అధికారులకు రెడ్‌కో సీఎండీ కీలక ఆదేశాలు

సాక్షర, హైదరాబాద్: రాష్ట్రంలో సాగుకు సోలార్ పంపుసెట్లను అందించనున్నట్టు రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన సోలార్ పంపుసెట్ల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టీజీ రెడ్‌కో వీసీ, ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆ సంస్థ అధికారులు, జిల్లా మేనేజర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన పథకాల అమలును వేగవంతం చేసి గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. మాడల్ సోలార్ విలేజ్, రూఫ్‌టాప్ సోలార్, పీఎం కుసుమ్ పథకం, వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్, ఎలక్ట్రికల్ వాహన చార్జింగ్ స్టేషన్లపై ఆయన ఆరా తీశారు. గృహజ్యోతి ఇండ్లపై సోలార్ ప్లాంట్లురూఫ్‌టాప్ సోలార్ పథకంలో భాగంగా గృహజ్యోతి పథకం కింద నిర్మించిన ఇండ్లపై విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆసక్తి చూపిన వారి ఇండ్లపై ప్లాంట్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పీఎం కుసుమ్ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో రెడ్‌కో జీఎం సీఎస్‌వీ ప్రసాద్, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

# చదువు ఒక్కటే భవిష్యత్తును మార్చే ఆయుధం

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్
- ఆరోగ్యం, విద్య, భద్రతపై ఆదివాసీ గ్రామాల్లో పోలీసుల అవగాహన
- చెరువుగూడ గ్రామంలో పోలీసు మీకోసం కార్యక్రమం
- 6 గ్రామాల ప్రజలకు 6 విభాగాల వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరం



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర):ఆదివాసీ గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడంతో పాటు, ప్రజల్లో అవగాహన పెంపొందించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో చెరువుగూడ గ్రామంలో పోలీసు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 6 గ్రామాల ప్రజలకు 6 విభాగాలకు చెందిన వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది గ్రామ ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు, బాబాలను నమ్మకుండా ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి సాగు చేయడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉన్నప్పుడే గ్రామాల్లో ప్రశాంతత, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బాలబాలికలకు సమాన విద్యా అవకాశాలు కల్పించి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని, చదువు ఒక్కటే జీవితాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధమని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసు అక్క లేదా డయల్ 112 ద్వారా పోలీసులను సంప్రదించాలని, సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. తల్లిదండ్రులు బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని, బాల్యవివాహాల సమాచారం తెలిసిన విద్యార్థినులు పోలీసులకు నిర్భయంగా సమాచారం అందించాలని తెలిపారు. యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, విద్యార్థులు తమ తల్లిదండ్రులు హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరు విభాగాలకు చెందిన వైద్య నిపుణులచే ఉచిత వైద్య సేవలు అందించారు. కంటి సమస్యలు ఉన్నవారికి ఆదిలాబాద్‌లో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించి, అనంతరం తమ వాహనాల్లో గ్రామానికి తిరిగి చేరవేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, గ్రామ ప్రజలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రిత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఎస్ఐ జి. విజయ్, ఆదిలాబాద్ నుండి వచ్చిన వైద్యులు డాక్టర్ సందీప్ ఐత్వార్, డాక్టర్ టి. వెంకటేష్, డాక్టర్ ఇందూజ, డాక్టర్ శ్వేత, డాక్టర్ సౌమ్య, డాక్టర్ సాగ్నిక్, గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ భగవంతరావు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు రెట్టింపు చేస్తామని నమ్మించి మోసం ... నలుగురిపై కేసు నమోదు




(మావల, సాక్షర):ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బులు రెట్టింపు చేస్తామని నమ్మించి ప్రజలను మోసం చేస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మావల ఎస్ హెచ్ ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు.భగత్ సింగ్ నగర్ కు చెందిన గణేష్ అనే వ్యక్తి గతంలో కామారెడ్డి సమీపంలో విజయ్, రేఖ, బాలాజీ అనే వ్యక్తుల వద్ద రూ.15,000 తీసుకోగా, మూడు నెలల తర్వాత రెట్టింపు నగదు ఇస్తామని వారు నమ్మించారు.అనంతరం జనవరి 28న లక్ష్మి, విజయ్, రేఖ, బాలాజీ అనే నలుగురు వ్యక్తులు భగత్ సింగ్ నగర్ కు వచ్చి రూ.30,000 తీసుకున్నారు. అదనంగా మరో రూ.30,000 చెల్లిస్తే అదే రోజు రూ.1,00,000 తిరిగి ఇస్తామని నమ్మించడంతో బాధితుడు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ.30,000 బదిలీ చేశాడు.అనంతరం నిందితులు భోజనం చేసి వస్తామని చెప్పి అంబేద్కర్ చౌక్ లోని బావర్చి హోటల్ కు వెళ్లి, భోజనం అనంతరం ఇన్నోవా కారులో పరారయ్యారు. ఈ క్రమంలో నిందితులకు చెందిన వివో మొబైల్ ఫోన్ హోటల్ వద్ద మరిచిపోయి వెళ్లారు. ఆ ఫోన్ లో నిందితుల ఫోటోలు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఇదే తరహాలో మరో 16 మందిని కూడా మోసం చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా, నిందితులు ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపాడు.ఈ ఘటనపై మావల పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 57/2026, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 318(4) రెడ్ విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు. నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి. 1. లక్ష్మి - పరారీలో ఉంది, 2.విజయ్ ఆలియాస్ దాసరి రాజు, తండ్రి గంగారం, నివాసం చైతన్య కాలనీ, బాన్సువాడ, కామారెడ్డి జిల్లా. 3. రేఖ - పరారీలో ఉంది.4. బాలాజీ - కామారెడ్డి జిల్లా, పరారీలో ఉన్నాడు. ప్రజలు డబ్బులు రెట్టింపు చేస్తామని, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే వ్యక్తుల మాటలను నమ్మి నగదు బదిలీ చేయవద్దని, ఇటువంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ హెచ్ ఓ సూచించారు. ఎవరైనా సైబర్ లేదా ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ నంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు.

## ఒక్క వానకే హైదరాబాద్ చెరువుల కళకళ..

సాక్షర, హైదరాబాద్: ఒకప్పుడు మురుగుతో నిండి.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఉపిరిసలుపుకోని ఆ చెరువులు.. నేడు హైడ్రా సంకల్ప బలం.. ఒకే ఒక్క వాన ధాటికి సరికొత్త జీవనాన్ని సంతరించుకున్నాయి. ఎండిపోయిన జాడ నుంచి స్వచ్ఛమైన జలకళతో తొణికిసలాడుతూ నగర ప్రజల దాహార్తిని తీర్చే అమృత ధారలుగా మారుతున్న ఆ జలాశయాల విజయగాథే ఈ నేటి చారిత్రక పరిణామం. ఎల్‌నినో ప్రభావంతో వాన చినుకు కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగర ప్రజలకు వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. శుక్రవారం కురిసిన సుమారు 7 సెంటీమీటర్లు భారీ వర్షం హైదరాబాద్ వాసుల మోములపై చిరునవ్వులు పూయించింది. ముఖ్యంగా మాదాపూర్‌లోని సున్నం చెరువు , తమ్మిడికుంట జలాశయాలు వర్షపు నీటితో కళకళలాడుతుండటం స్థానికుల్లో అమితానందాన్ని నింపుతోంది.



ఒకప్పుడు ఈ చెరువుల పరిస్థితి చూస్తే కన్నీళ్లే మిగిలేవి. మురుగు నీరు.. భారీగా పేరుకుపోయిన పూడిక.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఆ చెరువులు దుర్గంధం వెదజల్లాయి. నీటి జాడ లేక ఎండిపోయి వెలవెలబోయిన ఆ జలాశయాలను చూసి స్థానికులు ఆవేదన చెందేవారు. కానీ నేడు ఆ దృశ్యాలు పూర్తిగా మారిపోయాయి. నగరంలోని చెరువులను కాపాడేందుకు 'హైడ్రా' చేపట్టిన సంకల్పం ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తోంది. సున్నం చెరువులో దశాబ్దాలుగా పేరుకుపోయిన 10 నుంచి 15 అడుగుల పూడికను హైడ్రా తొలగించింది. ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు.. చుట్టూ వాకింగ్ పాత్‌వేలు, పిల్లల కోసం ఆటస్థలాలు, పూలు, మొక్కలతో ఆ ప్రాంతాన్ని ఒక సుందరమైన పర్యావరణ కేంద్రంగా తీర్చిదిద్దింది.

అయితే చెరువులను అందంగా చేయడం ఎంత ముఖ్యమో.. వాటిలోకి వర్షపు నీరు చేరేలా చేయడం అంతకంటే ముఖ్యం. ఈ వాస్తవాన్ని గుర్తించిన హైడ్రా అధికారులు.. రోడ్లపై వృథాగా పారే వర్షపు నీరు నేరుగా చెరువులోకి చేరేలా ప్రత్యేకంగా 'ఇన్‌లెట్లను' ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే ఇన్‌లెట్లు ఆ ప్రాంతానికి జీవనాధారంగా మారాయి. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ప్రవహించాల్సిన నీరంతా నేరుగా సున్నం చెరువులోకి పరుగులు పెట్టింది. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. తమ కళ్ల ముందే చెరువు నీటితో నిండుతుండటం చూసి పరవశించిపోయారు. కొందరైతే ఈ ఆనంద క్షమాలను వీడియోలు తీసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు పంపి తమ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ చెరువులు, ప్రారంభోత్సవానికి ముందే జలకళ సంతరించుకోవడం శుభపరిణామమని స్థానికులు ఉప్పొంగిపోతున్నారు.

ఈ వర్షపు నీరు చెరువులో నిలవడం వల్ల కేవలం అందం మాత్రమే కాదు.. వేలాది మందికి తాగునీటి భద్రత చేకూరుతుంది. ఎండిపోయిన బోర్లు మళ్లీ ఊపిరి పీల్చుకుంటాయని.. భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. "చెరువులు బతికితేనే నగరానికి భవిష్యత్తు" అనే నినాదానికి హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ పనులు నిజ రూపం ఇస్తున్నాయి. మురుగు కూపాలుగా ఉన్న జలాశయాలు స్వచ్ఛమైన వర్షపు జలాలతో కళకళలాడుతుంటే.. హైదరాబాద్ భవిష్యత్తుపై భరోసా కలుగుతోంది.

## ఈ దీపావళిని 'సీన్' మూవీతో సెలబ్రేట్ చేసుకుందాం - హీరో సూర్య



సాక్షర, హైదరాబాద్ : హీరో సూర్య, మలయాళ బ్లాక్‌బస్టర్ 'ఆవేశం' ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలసి యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్ 'సీన్' చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నస్లేన్, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య అగరం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషన్ కంటెంట్ కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎన్వీఆర్ సినిమా ద్వారా గ్రాండ్ రిలీజ్ కానుంది. 'సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 నవంబర్ 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ. లవ్ యు. మనందరం ఒక్కటే. వి ఆర్ వన్ ఫ్యామిలీ. మీరందరూ నాకు అన్‌కండిషనల్ లవ్ ఇచ్చారు. ఈ ఏడాదిలో మిమ్మల్ని కలవడం ఇది మూడోసారి. దీన్ని ఒక బ్లెస్సింగ్‌గా భావిస్తున్నాను. ఈ ఏడాది చాలా అద్భుతంగా ఉంది. ఇప్పుడు అందరూ పాన్ ఇండియా గురించి మాట్లాడుతున్నారు. కానీ నాగార్జున గారు ఇంతకుముందే ఇతర భాషల డైరెక్టర్స్‌తో కలిసి పనిచేశారు. అన్ని ఇండస్ట్రీలను కలుపుకుంటూ వర్క్ చేసేవారు. మణిరత్నం గారు, ప్రియదర్శన్ గారు, మహేష్ భట్ గారు.. ఇలా ఎంతోమంది దర్శకులతో కలిసి పనిచేశారు. అది ఎప్పుడూ నా మనసులో ఉంటుంది. 'విశ్వనాథన్ అండ్ సన్స్'లో చాలా భాషలకు చెందిన నటీనటులు కలిసి పనిచేశారు. ఎక్కడికి వెళ్లినా చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. వెంకీ చాలా బ్యూటిఫుల్ ఫిల్మ్ ఇచ్చాడు. ఇప్పుడు జిత్తుతో కలిసి 'సీన్' చేశాను. తన 'రోమాంచం', 'ఆవేశం' సినిమాలను మీరు చూసే ఉంటారు. 'సీన్' కూడా అలాంటి ఒక బ్యూటిఫుల్ సినిమా. తనతో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. 'వీరభద్రుడు', 'విశ్వనాథన్ అండ్ సన్స్' తర్వాత మరోసారి మిమ్మల్ని కలవడం హ్యాపీగా ఉంది. మీ అందరి ప్రేమకు థాంక్యూ. మా టీమ్ సభ్యులు అద్భుతమైన వర్క్ ఇచ్చారు. మేమందరం కలిసి ఒక బ్యూటిఫుల్ సినిమాను అందిస్తున్నాం. ఇందులో మర్డర్ మిస్టరీ, మ్యాడ్‌నెస్, నవ్వులు.. అన్నీ ఉన్నాయి. రాకేందు మౌళి తెలుగులో చాలా చక్కని మాటలు, పాటలు రాశారు. చాలా కమిట్‌మెంట్‌తో పనిచేశారు. ఈ సినిమాలో చాలా ఫ్రెష్ టాలెంట్ కూడా ఉంది. నజ్రియాతో కలిసి పనిచేయడం చాలా హ్యాపీగా అనిపించింది. తను చాలా అద్భుతమైన నటి. తను నేచురల్ స్టార్. ఈ సినిమాలో తను స్టంట్స్ కూడా చేసింది. ఇది చాలా స్పెషల్ ఫిల్మ్. ఇందులో ఒక డైలాగ్ ఉంది. అది నిజంగా మీ జీవితంలో కూడా ఉపయోగపడుతుంది. మనపై మనం నమ్మకం ఉంచి ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు. 'సీన్' చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కూడా. కుటుంబ సభ్యులందరూ కలిసి వచ్చి ఈ సినిమాను చూడొచ్చు. ఈ సినిమాతో దీపావళిని సెలబ్రేట్ చేసుకుందాం. లవ్ యు ఆల్. హీరోయిన్ నజ్రియా నజీమ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. 'అంటే సుందరానికి' సినిమా తర్వాత మరోసారి మీ అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మీ అందరి ప్రేమ, ఆదరణ, అభిమానానికి ధన్యవాదాలు. ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లు చేశాను. ఈ సందర్భంగా మాస్టర్స్‌కు థాంక్స్ చెబుతున్నాను. వాళ్లు నాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. నాకు మాయ లాంటి క్యారెక్టర్ ఇచ్చిన జిత్తు మాధవన్‌కు థాంక్యూ. క్యారెక్టర్ చాలా యూనిక్‌గా ఉంటుంది. అలాగే మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సూర్య గారితో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. నవంబర్ 6న అందరూ థియేటర్లలో ఈ సినిమాను చూడాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అందరూ సూర్య గారిని హ్యాట్రిక్ హిట్ కొట్టాలని అడుగుతున్నారు. నేను కూడా తోటి ఫ్యాన్‌గా అదే అడుగుతున్నాను. కచ్చితంగా హిట్ కొట్టాలి. అభిమానులుగా మీ అందరం ప్రామిస్ చేస్తున్నాం.. ఇది హ్యాట్రిక్ హిట్ అవుతుంది. ఆయన ఈ ఏడాది మూడో సినిమాతో వస్తున్నారు. మరో రెండు సినిమాలు ఆల్రెడీ షూటింగ్ పూర్తి చేసుకున్నాయి. ఇంకో సినిమా స్టార్ట్ కాబోతోంది. ఆయన ఎందుకంత హార్డ్ వర్క్ చేస్తున్నారంటే, ఆయనకు సినిమా అంటే ఇష్టం. సంవత్సరంలో 365 రోజులు ఆయన సినిమా కోసమే పనిచేస్తారు. మనం సూర్య గారికి సెల్యూట్ చెప్పాలి. ఈ టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. లిరిక్ రైటర్ రాకేందు మౌళి మాట్లాడుతూ.. 'వీరభద్రుడు', 'విశ్వనాథన్ అండ్ సన్స్'తో సూర్య గారు రెండు బ్లాక్‌బస్టర్లు కొట్టారు. ఇప్పుడు ఈ సినిమాతో హ్యాట్రిక్ కొట్టబోతున్నారు. ఈ సినిమాలో సూర్య గారు చేస్తున్న క్యారెక్టర్.. 'సింగం', 'శివపుత్రుడు' క్యారెక్టర్లను మిళితం చేసినట్టుగా ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ రెండూ ఉంటాయి. ఈ సినిమాకు అన్ని పాటలు, డైలాగ్స్ రాశాను. ఇవి వింటున్నప్పుడు ఒక తెలుగు సినిమా చూస్తున్న ఫీలింగ్ మీకు కలుగుతుంది. నవంబర్ 6న ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. ఇందులో చాలా కామెడీ ఉంటుంది. పొట్ట చెక్కలయ్యేలా నవ్వులు ఉంటాయి. ఒక క్రేజీ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

ప్రొడ్యూసర్ జయశ్రీ దామోదరన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అగరం స్టూడియోస్‌లో మేము చేస్తున్న తొలి సినిమా ఇది. సూర్య గారి వల్ల ఇది సాధ్యపడింది. ఈ దీపావళికి అందరూ ఎంజాయ్ చేసే సినిమా ఇది. మా డిస్ట్రిబ్యూటర్ ఎన్వీఆర్ ప్రసాద్ గారికి ధన్యవాదాలు. అందరూ ఈ సినిమాను థియేటర్లలో ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను. నిర్మాత ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సూర్య గారి కెరీర్‌లో ఎన్నో బిగ్ హిట్స్ ఉన్నాయి. ఈ ఏడాది 'వీరభద్రుడు', 'విశ్వనాథన్ అండ్ సన్స్', ఇప్పుడు 'సీన్'.. ఈ మూడు సినిమాలు బ్లాక్‌బస్టర్ విజయాలతో ప్రేక్షకులను అలరిస్తాయని ఆశిస్తున్నాను. కచ్చితంగా ఈ సినిమా సూర్య గారికి హ్యాట్రిక్ అవుతుంది. అలాగే డైరెక్టర్ గారికి కూడా ఇది హ్యాట్రిక్ సినిమా అవుతుంది.